ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 06.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 317 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



డబ్ల్యూపీఎల్ విజేత.. ఆర్‌సీబీ 10

గాంధీ ఏ పాపం చేశారని పేరు తొలగించారు?

యూపీఏ తెచ్చిన ఉపాధి పథకం ఓ నిశ్శబ్ద విప్లవం



- బలమైన బ్రిటిష్ పాలకులు గాంధీని ముట్టుకోలేక పోయారు
- దేశానికి చెందిన మతతత్వ శక్తులు ఆయన్ని కాల్చి చంపాయి
- చెన్నై బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

చెన్నై, ఫిబ్రవరి 5 : మహాత్మా గాంధీ ఏం పాపం చేశారని ఆయన పేరును ఉపాధి హామీ పథకం నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రశ్నించారు. గురువారం సాయంత్రం చెన్నై నగరంలో ఉపాధి హామీ పథకం నిబంధనలు మార్పు, ఉపాధి పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి ఆ పథకం కనిపించకుండా చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది, ఈ చట్టంలో మహాత్మా గాంధీని పేరు తొలగించడమే కాదు వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ గ్యారంటీ కల్పించాలన్న ఆత్మను సైతం తొలగించారని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కోట్లాది మంది వ్యవసాయ కార్మికులు ఏం పాపం చేశారని ఉపాధి హామీ పథకంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం

...:: మిగతా 2లో



"ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం దాడికి దిగుతున్నారు. పాలమూరు జిల్లాలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రచారానికి తీసుకువచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి ప్రధాని సహా దేశం మొత్తం నేతలను తీసుకురండి. బీజేపీ అందరినీ ప్రచారానికి తెచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా?. కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో బీజేపీకి చూపిస్తాం. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని మోదీ చెప్పారు. ఏం ఇవ్వడానికి ఢిల్లీ నేతలను తెచ్చారు."

\- సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజా పాలనపై విషం చిమ్ముతున్నారు

- ప్రభుత్వం దిగిపోవాలని దాడికి దిగుతున్నారు
- బీజేపీ, బీఆర్ఎస్ ది ఫెవికాల్ బంధం
- ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదు
- ఏమీ ఇవ్వకుండా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారు?
- కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో బీజేపీకి చూపిస్తాం
- గుమ్లాపూర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్/ చొప్పదండి

ఫిబ్రవరి 5: ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం దాడికి దిగుతోందని ఫైర్ అయ్యారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియా కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారని గుర్తుచేశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పలేదన్నారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు

...:: మిగతా 2లో



నరవణె పుస్తక వివాదం.. రాజ్యసభలో మాటల యుద్ధం

రిటైర్డ్ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'పై గురువారం రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.

9



ఓలా,ఉబర్‌కు ప్రత్యామ్నాయం 'భారత్ ట్యాక్సీ'

ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్రం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఢిల్లీలో దీన్ని అధికారికంగా ప్రారంభించారు.

9

కాంగ్రెస్ పార్టీకి దూరదృష్టి లేదు



- సభలో 25 ఏళ్లుగా నన్ను అవమానిస్తూనే ఉంది
- కాంగ్రెస్ తప్పిదాలను సరిచేసేందుకే ఎక్కువ సమయం
- ముందుచూపుతో పనిచేస్తేనే దేశాభివృద్ధి
- రాజ్యసభలో ప్రసంగంలో ప్రధాని మోదీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదని ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ చేసిన తప్పిదాలను సరిచేసేందుకే ఎక్కువ సమయం గడిచిపోతోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలో భారత్‌పై నెలకొన్న అప్రతిష్ఠను తొలగించేందుకు చాలా కష్టపడాల్సి వస్తోందని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, టీఎంసీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నా ప్రజల కోసం ఏం చేయలేదని విమర్శించారు. ఈ క్రమంలోనే 2002 నుంచి కాంగ్రెస్ తనపై దూషణలు చేస్తూనే ఉందని మోదీ అన్నారు. "విపక్ష నేతల దూషణలే నా ఆరోగ్య రహస్యం. సభలో 25 ఏళ్లుగా కాంగ్రెస్ నన్ను అవమానిస్తూనే ఉంది. నన్ను ఒకరు మీ ఆరోగ్య రహస్యం ఏంటని అడిగారు. రోజూ రెండు కిలోల తిట్లు తింటాను అని చెప్పాను." అనగానే సభలో నవ్వులు పూశాయి.

రాహుల్‌అహంకారం పరాకాష్టకు చేరింది

అటు రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూపై లోక్‌సభ విపక్ష

...:: మిగతా 2లో




గ్రూప్1 అభ్యర్థులకు ఊరట

- నియామకాలపై సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన హైకోర్టు
- ఎవరెన్ని కుట్రలు పన్నినా న్యాయపోరాటంలో విజయం సాధించాం: సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: గ్రూప్1 కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో ఊరట లభించింది. నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పును వెలువరించారు. మెయిన్స్ జవాబు పత్రాలు పునర్ మూల్యాంకనం చేయాలని గతంలో పేర్కొన్నారు. సింగిల్ జడ్జి

...:: మిగతా 2లో



కోల్ మైనింగ్‌లో పేలుడు: 18 మంది మృతి

మేఘాలయలో కోల్ మైనింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. దాదాపు 18 మంది మరణించి ఉండొచ్చని తెలుస్తోంది. మేఘాలయ, ఈస్ట్ జైంటియా జిల్లాలో గురువారం ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు.

9

రేవంత్ వికృత భాషతో

తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన జాతిపిత కేసీఆర్
- ఈ నిజాన్ని తట్టుకోలేకే రేవంత్ రెడ్డి విషం కక్కుతున్నారు
- మాజీ మంత్రి హరీష్ రావు మండి పాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: రాష్ట్ర చరిత్రలో బూతుల ముఖ్యమంత్రిగా నిలిచే విధంగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, రైతు, విద్య, విద్యుత్, ఉద్యోగ సమస్యలను పక్కన పెడుతూ స్కాం క్యాలెండర్ అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆరోపించారు. కేసీఆర్ కృషిని తక్కువ చూపించడమే లక్ష్యంగా ఆయన వికృత భాషను వాడుతున్నారని, మేధావులు, బుద్ధిజీవులు స్పందించాల్సిందని

...:: మిగతా 2లో





బీఆర్ఎస్-, కాంగ్రెస్ పాలనలో అప్పులే మిగిలాయి

- పట్టణ ప్రాంతాలు ఆర్థిక పతనానికి గురయ్యాయి
- హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్‌ప్రజలను మోసం చేసింది
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు
- బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తు చేస్తాం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: గత 12 ఏళ్లుగా తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేకుండా అప్పులే మిగిలాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనల ఫలితంగా తెలంగాణ పట్టణ ప్రాంతాలు తీవ్రమైన ఆర్థిక, పరిపాలనా పతనానికి గురయ్యాయని ఆయన తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్ లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన " పట్టణ తెలంగాణలో 12 ఏళ్ల క్షీణత (బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన)" అనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి రాంచందర్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మహారాష్ట్ర మంత్రి, బీజేపీ మున్సిపల్ ఎన్నికల తెలంగాణ ఇన్‌ఛార్జ్ ఆశిష్ షెలార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందద్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు బీబీ పాటిల్, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు

...:: మిగతా 5లో



బీజాపుర్లో మరో ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లా అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య కాల్పులు జరిగాయి. ఆ ఘటనలో మావోయిస్టు కీలక నేత ఉదమ్ సింగ్ మృతి చెందాడు.

9



...:: 2లో

దేవుడు ఆదేశించిండు.. నేను నడుచుకుంటూ వచ్చిన

సదాశివపేటలో నిమ్మ సోడా అమ్మే మహిళకు జగ్గారెడ్డి రూ. లక్ష సాయం

ఎస్ఐఆర్‌కు ముందు

బీఎల్ఏలను నియమించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

...:: 3లో



గాంధీ ఏ పాపం చేశారని పేరు తొలగించారు?

మొదటిపేజీ తరువాయి

మార్పులు చేసిందని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రతి వ్యవసాయ సీజన్లో 50 పైసల కూలీ ధరల పెరుగుదల కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ఆందోళనలు, పోలీసు లాఠీచార్జీలు, రక్తపాతం జరిగేవి అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ దారుణమైన పరిస్థితులను పారద్రోలాలన్న మానవీయకోణంతో యూపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో దేశంలోని కోట్లాదిమంది వ్యవసాయ కార్మికుల కోసం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఈ దేశంలో తీసుకువచ్చారని తెలిపారు. చిన్న రక్తపాతం, ఎలాంటి ఆందోళనలు లేకుండా కూలీలకు 100 రోజుల పని గ్యారంటీ కల్పిస్తూ, ఉపాధి అనేది వ్యవసాయ కార్మికుల హక్కు అని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం దేశంలోని కోట్లాది వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఒక నిశ్శబ్ద విప్లవం అని వర్ణించారు. ఇంతటి గొప్ప పథకాన్ని కనుమరుగు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చింది, చివరకు దేశ ప్రజలు మహాత్మునిగా పిలుచుకునే గాంధీ పేరును సైతం తొలగించిందని తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం 2005 ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించే వరకు వ్యవసాయ కార్మికుల పక్షాన దేశంలోని కోట్లాది కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు వ్యవసాయ కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. సామాన్యునికి ఇబ్బందులు వచ్చినప్పుడు తమిళనాడు ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడుతుందని అన్నారు. 1915 నుంచి 1947 వరకు మహాత్మా గాంధీ నాయకత్వంలో ఈ దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి అయినప్పటికీ బలమైన బ్రిటిష్ సామ్రాజ్యం గాంధీజీని ముట్టుకునే సాహసం కూడా చేయలేక పోయిందని తెలిపారు. దురదృష్టం ఏంటంటే స్వాతంత్రం సిద్ధించిన ఆరు నెలల్లోనే మన దేశానికి చెందిన మత శక్తులు మహాత్మా గాంధీని పట్టపగలు తుపాకీ గుళ్లతో కాల్చి చంపాయి అన్నారు. బలమైన సామ్రాజ్యవాద బ్రిటిష్ ప్రభుత్వం గాంధీని ముట్టుకోలేకపోయింది కానీ మన దేశానికి చెందిన మతవాద శక్తులు మనమంతా మహాత్ముడిగా పిలుచుకునే గాంధీజీని చంపేశాయి అన్నారు. సభలో తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు సెల్వ, ఏఐసీసీ సెక్రటరీ చోలాంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనపై విషం చిమ్ముతున్నారు

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని తెలిపారు.

కాళేశ్వరం, పాలమూరుకు జాతీయ ఎందుకు ఇవ్వలేదు?

కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని సీఎం రేవంత్‌ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మెట్రో రైలు మంజూరు చేయలేదని, మూసీకి నిధులు ఇవ్వలేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదన్నారు. ఏమీ ఇవ్వకుండా బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారు? అని ప్రశ్నించారు. దేశంలోని బీజేపీ అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా మున్సిపల్ ఎన్నికల్లో సీటు గెలుస్తారా? కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో బీజేపీకి చూపిస్తామని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల బీజేపీ ఎంపీలను గెలిపించారని మండిపడ్డారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోందన్నారు. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలో కూలేశ్వరం అయిందని ఆరోపించారు. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించామని, ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదని మండిపడ్డారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ముందుకెళ్తోందని సీఎం స్పష్టం చేశారు. చొప్పదండిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో రామడుగులో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, రూ. 5 కోట్లతో గంగాధర మండలం మధురానగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఉత్తర తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, సాగునీరు రంగాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు న్యాయం చేయడం లేదని, రెండు బడ్జెట్లలోనూ తగిన నిధులు కేటాయించలేదని సీఎం విమర్శించారు. తెలంగాణ ప్రజలను అవమానించే వ్యాఖ్యలు చేసే శక్తులతో పొత్తులు పెట్టుకునే వారిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలకు గాను 8 ఎమ్మెల్యేలను ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఈ ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం, సాగునీరు తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతోందని, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సారథ్యంలో కరీంనగర్ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు సమన్వయంతో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రజలకు నేరుగా చేరే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వం ముందుకెళ్తుంటే, ప్రతిపక్షాలు అసహనంతో విమర్శలు చేస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, రెండు కేంద్ర బడ్జెట్లలో రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి దూరదృష్టి లేదు

మొదటిపేజీ తరువాయి

నేత రాహుల్‌గాంధీ వివాదాస్పదం వ్యాఖ్యల చేయడంపైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "కాంగ్రెస్ యువరాజు ఒక ఎంపీని దేశద్రోహి అన్నారు. కాంగ్రెస్ యువరాజు అహంకారం పరాకాష్టకు చేరింది. కాంగ్రెస్ వీడిన మరెవరినీ రాహుల్ దేశద్రోహి అనలేదు. ఎంపీ సిక్కు కావున ఆయన్ని దేశద్రోహిగా అవమానించారు. ఇది సిక్కులకు, గురువులకు అవమానం. సిక్కుల పట్ల కాంగ్రెస్‌లో ఉన్న ద్వేషానికి నిదర్శనం. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబానికి చెందిన ఎంపీ, రాజకీయ సిద్ధాంతం మార్చుకుంటే దేశద్రోహి అయిపోతారా? ఒక పౌరుడిని దేశద్రోహి అనడాన్ని దేశం ఎలా సహిస్తుంది? ఇలాంటి వ్యక్తులు కాంగ్రెస్‌ను ముంచుతారు. ఆఖరికి మహాత్మాగాంధీ ఇంటిపేరును కూడా చోరీ చేశారు." అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. "ప్రపంచం దృష్టిలో భారత్‌పై ప్రతికూల ముద్ర చెరిపివేయడానికి కృషి చేస్తున్నాం. భవిష్యత్తుకు అవసరమైన విధానాలపై పూర్తి దృష్టిపెట్టాం. ప్రస్తుతం భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసం పెరుగుతోంది. భారత్ అనేక దేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా ఉంది. ప్రపంచ సంక్షేమం కోసం భారత్ తనదైన పాత్ర పోషిస్తోంది. వృద్ధి చెందిన దేశాలు భారత్‌తో వాణిజ్య సంబంధాలకు ఆసక్తి చూపుతున్నాయి. ఈయూతో ఒప్పందం వల్ల ప్రపంచ స్థిరత్వంపై అన్ని దేశాలకు విశ్వాసం పెరిగింది. అమెరికాతో ఒప్పందం తర్వాత స్థిరత్వంతో పాటు వేగం అందుకోగలమని నమ్మారు. వాణిజ్య ఒప్పందాలు ప్రపంచానికి సానుకూల సంకేతాలు. దేశ ప్రజల ఉపాధి, హక్కులు హరిస్తున్నారు. ప్రపంచాన్ని ఎంత మోసగించాలని చూసినా అద్దంలో మోసం తెలిసిపోతుంది. కాంగ్రెస్ హయాంలో జేబులు నింపుకోవడానికి సరిపోయింది." అని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు.

ముందుచూపుతో పనిచేస్తేనే దేశాభివృద్ధి

"వికసిత్ భారత్ స్వప్నం సాకారం దిశగా మా ఆలోచనలు ఉన్నాయి. 2047లోగా అభివృద్ధి చెందిన దేశంగా మనం మారాలి. 2047 విజన్‌పై అనేకమంది విమర్శలు చేస్తున్నారు. ముందుచూపుతో పనిచేస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. స్వాతంత్ర్య సాధన కోసం లక్షలమంది ప్రాణాలు అర్పించారు. స్వాతంత్ర్యం వస్తుందనే నమ్మకంతోనే అనేకమంది పోరాడారు. ఎన్నికలు వస్తాయి, వెళ్తాయి, దేశాభివృద్ధే మా లక్ష్యం. అన్నిరంగాల్లో భారత్ నెంబర్‌వన్ అయితే చాలు మా లక్ష్యం నెరవేరినట్లే. అన్ని చోట్లా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తున్నాం. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ వినియోగం దిశగా చర్యలు చేపట్టాం". అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.



స్వప్న హత్య బాధాకారం

- సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి
- అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్ అసెంబ్లీలో పెట్టాలి
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 5: మొయినాబాద్‌లో కేతిరెడ్డిపల్లి గ్రామంలోని న్యాయవాది స్వప్న హత్య ఘటనపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్వప్న కుటుంబాన్ని పరామర్శించి వారిని ఓదార్చిన కవిత, పోలీసుల నిర్లక్ష్యమే ఈ దారుణానికి కారణమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందించాలని కోరారు. మొయినాబాద్ మండలం, కేతిరెడ్డిపల్లి గ్రామంలో న్యాయవాది స్వప్న హత్య సంఘటనకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆమె, స్వప్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చి ధైర్యం ఇచ్చినట్టు తెలిపారు. స్వప్న త్వరలోనే పెళ్లి చేసుకోబోతుండగా, కుటుంబ సభ్యుల చేతిలోనే హత్యకు గురైన విషయం అతి దారుణం. స్వప్న ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన చర్య తీసుకోలేదని ఆమె మండిపడ్డారు. పోలీసుల నిర్లక్ష్యమే ఈ ఘోర ఘటనకు కారణమని కవిత పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఇలాంటి ఘటనల ఏర్పాట్లు, మహిళలపై నేరాలు పెరుగుతున్నందుకు ప్రభుత్వానికి సీరియస్‌గా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని కవిత చెప్పారు. గన్‌తో బెదిరించి డబ్బులు తీసుకెళ్లే పరిస్థితులు జరిగిపోతున్నాయని, దీనిపై పోలీసులకు కఠినమైన ఆర్డర్లు ఇవ్వాలని ఆమె అన్నారు. లాయర్ల రక్షణ కోసం ముందే రూపొందించిన అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్‌ను రెండేళ్లుగా పెండింగ్‌లో ఉంచిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బిల్‌ను త్వరగా పాస్ చేయాలని డిమాండ్ చేశారు. స్వప్న హత్యకేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో మూడు నెలల్లో విచారణ చేసి, నిందితులకు శిక్ష విధించాలని, లేనిపక్షంలో నేరస్తులకు భయం లేకుండా పోతుందన్నారు. నలుగురు నిందితుల్లో ఒకరు గతంలో హత్యాయత్న కేసులో కూడా ఉన్నారని గుర్తు చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ గా స్పందించాలని కోరారు. అలాగే, గతేడాది హైదరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదాల్లో 22 మంది మృతి చెందినప్పటికీ ముఖ్యమంత్రి కుటుంబాలను పరామర్శించలేదని, శాసన శాఖలపై సీఎం దృష్టి పెట్టకపోవడం వల్ల నేరాలు పెరిగాయని ఆమె అభిప్రాయపడుతున్నారు. స్వప్న కుటుంబానికి మద్దతుగా తాము ఉన్నామని తెలిపారు.

రేవంత్ వికృత భాషతో
తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

హరీష్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమెరికా పర్యటన అనంతరం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు చూసి తీవ్ర ఆవేదన కలిగిందని ఆయన అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమేనని, అయితే ముఖ్యమంత్రి హోదాలో ఉండి సభ్య సమాజం అసహ్యించుకునేలా, తెలంగాణ సంస్కృతికి మాయని మచ్చలా ఉండే వికృత భాషను ఉపయోగించడం దారుణమని హరీష్ రావు మండిపడ్డారు. ఇలాంటి ప్రవర్తనతో రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రలో ఒక వికృత మనస్తత్వం కలిగిన బూతుల సీఎంగా మాత్రమే మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ లేని తెలంగాణ ఉందా? అని ప్రశ్నించిన హరీష్‌రావు, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలను నిజం చేసిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకం తెచ్చి 60 లక్షల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, 40 లక్షల మంది అవ్వా తాతలకు పెన్షన్లు, 24 గంటల కరెంటు, రైతు బీమా, వెయ్యి గురుకులాల ద్వారా ఆరు లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య వంటి ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. అందుకే తెలంగాణ సమాజం కేసీఆర్‌ను తెలంగాణ సాధించిన వ్యక్తిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన జాతిపితగా పిలుచుకుంటోందని తెలిపారు. ఈ నిజాన్ని తట్టుకోలేకే రేవంత్ రెడ్డి విషం కక్కుతున్నారని ఆరోపించారు. తాము కూడా అదే స్థాయిలో పరుష పదజాలంతో సమాధానం చెప్పగలమని, కానీ బాధ్యతగల శాసన సభ్యులుగా, పౌరులుగా సంస్కారంతో కూడిన రాజకీయాలనే నమ్ముతున్నామని హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రతి ముఖ్యమంత్రికి చరిత్రలో ఒక పేజీ ఉంటుందని, అయితే రేవంత్ రెడ్డి మాత్రం తెలంగాణ చరిత్రలో బూతుల ముఖ్యమంత్రిగా నిలిచిపోతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేకపోవడంతో తన అసమర్థతను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే వికృత భాషను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ మేధావులు, బుద్ధిజీవులు స్పందించాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. మేధావుల మౌనం రాష్ట్రానికి, దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి వికృత భాష, ప్రవర్తన తెలంగాణ ప్రతిష్టను, గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని, పాలనను గాలికి వదిలి బూతులతో కాలం వెళ్లదీస్తున్న తీరును ఖండించాలని కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను చిన్నబుచ్చే ప్రయత్నమే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేస్తున్నారని అన్నారు. ఉద్యమంలో ఎప్పుడూ లేని వ్యక్తి ఉద్యమాన్ని మలినం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు.



గ్రూప్1 అభ్యర్థులకు ఊరట

మొదటిపేజీ తరువాయి

ఆదేశాలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం తాజాగా తీర్పును వెలువరించింది. గ్రూప్1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మందికి ఇప్పటికే ప్రభుత్వం నియామక పత్రాలను అందజేసింది.

తీర్పును స్వాగతిస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

గ్రూప్ 1 నియామకాలపై హైకోర్టు వెలువరించిన తీర్పును సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయపోరాటంలో విజయం సాధించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన 563 మంది గ్రూప్1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి గ్రూప్1 అధికారులైన మీరంతా రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు.



దేవుడు ఆదేశించిండు.. నేను నడుచుకుంటూ వచ్చిన

- నీకు లక్ష రూపాయలు సాయం చేసిన!
- సదాశివపేటలో నిమ్మ సోడా అమ్మే మహిళకు జగ్గారెడ్డి సాయం

ప్రతిపక్షం, సదాశివపేట, ఫిబ్రవరి 5: "ఆ దేవుడు ఆదేశించాడు... నేను ఇట్లా కారు దిగి నడుచుకుంటూ వచ్చిన.. ఈరోజు నాతో నీకు సాయం జరగాలని రాసిపెట్టింది. నాకు కూడా అందరిని ఎట్లున్నారని అడిగే అలవాటు ఉంది. ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే వెంటనే సాయం చేస్తుంటా. నా తల్లిదండ్రులు నాకు ఇట్లాంటి పుట్టుకనిచ్చారు. ఇదిగో ఈ లక్ష రూపాయలు తీసుకొని సోడా మిషన్ కొనుక్కో. వ్యాపారం మంచిగా చేసుకో" అంటూ సదాశివపేటలోని నిమ్మ సోడా అమ్మే మహిళతో జగ్గారెడ్డి అన్న మాటలు ఇవి.

సోడా తాగి..రూ.లక్ష సాయం చేసిన జగ్గారెడ్డి!


టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం సదాశివపేట పట్టణంలో పర్యటించారు. ఆయన కారు దిగి వెళ్తుండగా నిమ్మ సోడా అమ్మే బండి కనిపించింది. ఆయన అక్కడ ఆగారు. నిమ్మకాయ సోడా తాగుతూ ఆ బండిని నడుపుతున్న మహిళతో ముచ్చటించారు. "ఏమ్మా ఎట్లా ఉంది వ్యాపారం.. మంచిగా జరుగుతోందా" అని అడిగారు. "కొత్త మెషిన్ కొనుక్కుంటే సోడాల గిరాకీ ఎక్కువవుతుంది. ఇప్పుడు చేస్తున్న వ్యాపారంలో ఏమీ మిగలడం లేదు. మీరు ఏదైనా సాయం చేస్తే బండి మంచిగా నడుపుకుంటాం" అంటూ ఆ మహిళ చెప్పింది. "ఎన్ని డబ్బులు ఇస్తే సోడా మిషన్ వస్తుంది? మీరు మంచిగా బతకగలుగుతారు?" అని జగ్గారెడ్డి అడిగారు. "లక్ష రూపాయలు పెడితే కొత్త మిషన్ వస్తుంది. ఈ ఎండాకాలంలో రోజుకు మూడు వేల రూపాయల దాకా వ్యాపారం అవుతుంది. మీరు సాయం చేస్తే మంచిగా బతుకుతం" అంటూ ఆ మహిళ బదులిచ్చింది. వెంటనే జేబులోంచి లక్ష రూపాయలు తీసిన జగ్గారెడ్డి.. "ఇదిగో ఈ లక్ష రూపాయలు తీసుకో.. ఎండాకాలం వచ్చేలోగా సోడాల మిషన్ కొనుక్కో. రోజుకు మూడు వేలు సంపాదించు" అంటూ ఆమెకు లక్ష రూపాయలు అందించారు. అప్పటికప్పుడే లక్ష రూపాయలు ఇస్తాడని ఊహించని ఆ మహిళ.. "అయ్యో సార్.. ఇప్పుడే ఇచ్చేస్తున్నారా" అంటూ సంతోషపడ్డది. ఈ లక్ష రూపాయలతో మీరు బాగుపడాలి మంచిగా వ్యాపారం జరగాలి అంటూ చెప్పి జగ్గారెడ్డి అక్కడి నుంచి ముందుకు వెళ్లారు.

బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న నేతకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడం ఏమిటి?

- మాధవరెడ్డిని చేర్చుకుని బీఆర్ఎస్ బీసీలకు ద్రోహం
- బీఆర్ఎస్ పార్టీ బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ పార్టీని బీసీలు రాజకీయంగా బొంద పెడతారు
- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తాం
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి5: బీసీ సమాజం సుదీర్ఘకాలంగా పోరాడి సాధించుకున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు జరగకుండా నిలువునా అడ్డుకున్నరెడ్డి జాగృతి నాయకుడు బుట్టెంగారి మాధవరెడ్డి ముసుకు తొలగిందని, బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నందుకు ప్రతిఫలంగా బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవాపూర్ పదవ వార్డు కౌన్సిలర్గా బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చిందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ జేఏసీ నేతలతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చట్టం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జీవో నెంబర్ తొమ్మిది విడుదల చేసిందని, ఈ జీవో తో బీసీలకు 42 శాతం సర్పంచులు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలు దక్కుతయని రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఎంతో సంబరపడ్డారని కానీ బీసీల ఆశలను అడియాసలు చేస్తూ బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకి రెడ్డి జాగృతికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి అనే వ్యక్తి రాత్రికి రాత్రి హైకోర్టు సుప్రీంకోర్టుల ద్వారా బీసీ రిజర్వేషన్లు అడ్డుకొని 42 శాతం రిజర్వేషన్ల జీవోను రద్దు చేయించారని అని తెలిపారు. మాధవరెడ్డి వెనుక ఏ శక్తి ఉందో తేలాలని రాష్ట్రవ్యాప్తంగా బీసీ సమాజం రోడ్లెక్కిందని, చివరికి రాష్ట్ర బందు జరిపి ఉద్యమాన్ని ఉధృతం చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు ఇలాంటి సందర్భంలో మాధవరెడ్డి ముసుగు తొలగిందని, కేసీఆర్, కేటీఆర్ హరీష్ రావు ఆదేశాలతో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాధవరెడ్డికి గులాబీ కండువా కప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్నందుకు బహుమానంగా బీఆర్ఎస్ పార్టీ తరపున కౌన్సిలర్ గా పోటీ చేయడానికి బి ఫామ్ ఇచ్చారని ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాకు ఆధారాలు చూపించారు. ఇన్ని రోజులు తాము బీసీ రిజర్వేషన్లకు మద్దతు అంటూ నమ్మబలికిన టిఆర్ఎస్ బీసీల ద్రోహిని తమ పార్టీలోకి చేర్చుకుని బీసీ సమాజానికి తాము బీసీలకు వ్యతిరేకం అని సందేశం ఇచ్చిందని ఆయన తెలిపారు. బీఆర్ఎస్కు బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న మాధవరెడ్డిని 48 గంటల్లోగా ఆ పార్టీ నుండి బహిష్కరించాలని, లేదంటే బీసీ రిజర్వేషన్లను మాధవరెడ్డి ద్వారా అడ్డుకున్నది బీఆర్ఎస్ పార్టీని నేనని దమ్ముంటే బహిరంగంగా వెల్లడించాలని ఆయన సవాల్ విసిరారు. లేకుంటే టిఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీ నేతలు కూడా మాధవ రెడ్డికి మద్దతు ఇచ్చిన వాళ్లే అవుతారని ఆయన హెచ్చరించారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జేఏసీ కో చైర్మన్ దిటి మల్లయ్య, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మనిమంజరి సాగర్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వా గారు అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ కోఆర్డినేటర్ గజ్జల సత్యరాజ్ గౌడ్, సంధ్యారాణి, పాలకూరి కిరణ్, సందీప్ ముదిరాజ్, ఇంద్రం రజక, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల చందు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



కశ్మీర్ మా దేశంలో అంతర్భాగమవుతుంది. కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను గౌరవించడం, యూఎన్ఎస్సీ తీర్మానాలు అమలు చేయడమే జమ్ము కశ్మీర్‌వివాదానికి సరైన పరిష్కారం. కశ్మీర్ ప్రజలకు సంఘీభావం తెలియజేస్తున్నా. గతేడాది జరిగిన ఘర్షణల తర్వాత కశ్మీర్ వివాదం మళ్లీ రాజుకుంది. ఇండియా ప్రాక్సీ టెర్రర్‌ను ఎగదోస్తోందని ఆరోపించారు.

- పాకిస్తాన్ ప్రధాని షరీఫ్

ప్రజా పాలనలో మత సామరస్యానికి పెద్దపీట

- మైనార్టీలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి
- అనేక మంది మైనార్టీ నేతలకు కాంగ్రెస్ అవకాశం
- మైనార్టీల అండతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం
- విద్వేష ప్రసంగాలకు నియంత్రణ కోసం చట్టం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- 'జమీయత్ ఉలమా యే హింద్' సమావేశం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 5: ప్రజా పాలనలో మత సామరస్యానికి పెద్దపీట వేస్తామని, ప్రజా ప్రభుత్వానికి అన్నీ వర్గాల ప్రజలు అండగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డికోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సంస్థల్లో జమీయత్ ఉలమా కూడా ఉండటం అభినందనీయమని అన్నారు. శంషాబాద్ మెట్రో క్లాసిక్ గార్డెన్స్ లో జమీయత్ ఉలమా యే హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మైనారిటీ, మెజారిటీ భేద భావం లేకుండా ప్రజలందరూ కలిసి ముందుకు వెళ్లడానికి జమియత్ సంస్థ పాటుపడుతోందని అన్నారు. మైనార్టీలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కోరారు. లోకసభ ఎన్నికల్లో తాను మల్కాజిగిరి నుంచి బరిలో దిగినప్పుడు జమియత్ స్వచ్ఛందంగా తనకు సహకరించిందని గుర్తు చేసుకున్నారు. తాను గల్లీ నుంచి ఢిల్లీ వెళ్లడానికి ఈ సంస్థ సహకరించిందని పేర్కొన్నారు. తద్వారా హిందువులతోపాటు ముస్లింలు తనను గెలిపించి పార్లమెంట్‌కి పంపారని ఆయన వివరించారు. మైనార్టీల అండతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక మంది మైనార్టీ నేతలకు అవకాశం ఇచ్చిందని సీఎం రేవంత్ వివరించారు. సల్మాన్ ఖుర్షీద్, హమ్మద్ పటేల్ తదితర నేతలు కాంగ్రెస్ పార్టీలో అగ్ర నాయకులయ్యారని గుర్తు చేశారు. ఇక రాష్ట్రంలో అజారుద్దీన్, షబీర్ అలీ లాంటి వాళ్లకు ఎంఎల్‌ఏ టికెట్‌లు ఇచ్చామని తెలిపారు. అలాగే 8 కార్పొరేషన్ల చైర్మన్లుగా మైనార్టీలను నియమించామని గుర్తు చేశారు. అజారుద్దీన్ ఎన్నికల్లో ఓడిపోయినా ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మంత్రిని చేశామన్నారు. పార్టీ టికెట్ ఇచ్చినప్పుడు ఆయనను గెలిపించుకునే బాధ్యత మీదేనని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

విద్వేష ప్రసంగాలకు నియంత్రణ కోసం చట్టం

విద్వేష ప్రసంగాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం స్పష్టం చేశారు. విద్వేష ప్రసంగాల నియంత్రణ కోసం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చట్టం తీసుకు రానున్నట్లు ప్రకటించారు. దేశం అభివృద్ధి చెందాలంటే అంతా కలిసి మెలిసి ముందుకు సాగాలని సీఎం రేవంత్ ఆకాంక్షించారు. పెట్టుబడులు రావాలంటే శాంతి భద్రతల పరిరక్షణ ముఖ్యమన్నారు. ఏ ఒక్కరి వల్ల దేశం అభివృద్ధి చెందదని, ఒక్కరే పదవిలో ఎల్లకాలం ఉండలేరన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి రాష్ట్రంలో మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కలిపించారని గుర్తు చేశారు. ఈ రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉందన్నారు. కులగణన చేసినప్పుడు రాష్ట్రంలో మైనార్టీ జనాభా కూడా లెక్కించామని వివరించారు.

ఒమన్ రాయబారితో జితేందర్ రెడ్డి భేటీ

- తెలంగాణలో పెట్టుబడులు, ఉపాధి, క్రీడా సహకారంపై చర్చలు



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 5 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (మాజీ ఎంపీ) ఏపీ. జితేందర్ రెడ్డి న్యూఢిల్లీలో ఒమన్ రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీతో గురువారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఒమన్ రాయబార కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం.. తెలంగాణ, ఒమన్ మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కించే దిశగా సాగింది. తెలంగాణలోని పెట్టుబడి అనుకూలమైన విధానాలను జితేందర్ రెడ్డి వివరించారు. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఒమన్ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను రాయబారి దృష్టికి తీసుకెళ్లారు.తెలంగాణ నుంచి గ్రానైట్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులను ఒమన్‌కు ఎగుమతి చేయడంపై సానుకూల చర్చలు జరిగాయి. తెలంగాణ, ఒమన్ మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంచేందుకు.. తెలంగాణ, ఒమన్ జట్ల మధ్య స్నేహపూర్వక ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహించాలని.. ఏ.పీ.జితేందర్ రెడ్డి ప్రతిపాదించారు. దీనికి రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీ సానుకూలంగా స్పందించారు. ఒమన్‌లో నివసిస్తున్న తెలంగాణ వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేకంగా చర్చించారు. తెలంగాణ పారిశ్రామిక వృద్ధిని అభినందించిన ఇస్సా సలేహ్ అల్ షిబానీ.. త్వరలోనే ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలతో తదుపరి చర్చలు జరుపుతామని చెప్పారు.ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. ఒమన్ వంటి దేశాలతో దీర్ఘకాలిక భాగస్వామ్యం ఏర్పడటం వల్ల.. ఇరుపక్షాలకు ఆర్థికంగా, సాంస్కృతికగా గొప్ప ప్రయోజనం చేకూరుతుంది" అని వ్యాఖ్యానించారు.



ఒక్కసారి అవకాశం ఇవ్వండి ప్రజలకు అండగా ఉంటా

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 5 : ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. మొయినాబాద్ మున్సిపల్ ప్రజలకు అండగా ఉంటానని 18వ వార్డు అభ్యర్థి చేగూరి అరుణ రామ కృష్ణగౌడ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గురువారం ఉదయం మొయినాబాద్ మున్సిపల్ లోని 18వ వార్డులో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను కౌన్సిలర్‌గా గెలిపించాలని కోరారు. అవకాశం ఇవ్వండి వార్డు ప్రజలకు అండగా ఉండి.. సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తానని తెలిపారు.

ఎస్ఐఆర్‌కు ముందు బీఎల్ఏలను నియమించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 5: రానున్న ప్రత్యేక సుదీర్ఘ సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్)ను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌కు కనీసం ఒక బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను నియమించాలని రాజకీయ పార్టీలను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి కోరారు. బూత్ స్థాయిలో బలమైన సమన్వయం ఈ ప్రక్రియకు కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఎల్ఏలను సాధ్యమైనంతవరకు ఆయా పోలింగ్ స్టేషన్‌ల పరిధిలోని స్థానికుల నుంచే ఎంపిక చేయాలని, వారు బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమస్యల సకాల పరిష్కారం కోసం ప్రతి పోలింగ్ బూత్‌కు కనీసం ఒక బీఎల్ఏ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, మిగతా రాష్ట్రాలు, తెలంగాణ సహా వాటికి సంబంధించిన షెడ్యూల్ ఏప్రిల్ -మే 2026 మధ్య ప్రకటించే అవకాశం ఉందని సీఈఓ వివరించారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సమయం పరిమితంగా ఉండటంతో రాష్ట్రంలో ముందస్తు సన్నాహక పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ సన్నాహక చర్యల్లో భాగంగా, 2025 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను 2002 ఎస్ఐఆర్‌లో నమోదైన ఓటర్లతో అనుసంధానించేలా టేబుల్‌టాప్ మ్యాపింగ్ చేపట్టామని తెలిపారు. అనంతరం ఫీల్డ్ స్థాయి మ్యాపింగ్ కొనసాగుతుండగా, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నివాసాలను గుర్తించి ధృవీకరించేందుకు బీఎల్ఓలు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ సమయంలో ప్రతి పోలింగ్ ప్రాంతాన్ని బీఎల్ఓలు మూడు నుంచి నాలుగు సార్లు సందర్శిస్తారని తెలిపారు. మొదటి సందర్శనలో ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారు. తదుపరి సందర్శనల్లో ముందుగా అందుబాటులో లేని కుటుంబాలను కవర్ చేస్తారు. సన్నాహక దశలో మ్యాపింగ్ కాకపోయిన ఓటర్లు కూడా ఎస్ఐఆర్ సమయంలో తమ వివరాలు సమర్పించుకునే అవకాశం ఉంటుందని సీఈఓ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్రను మరోసారి గుర్తు చేస్తూ, అన్ని పోలింగ్ స్టేషన్‌లకు బీఎల్ఏల నియామకాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఈఓ కోరారు. బూత్ స్థాయిలో సమర్థవంతమైన పాల్గొనడం సమన్వయాన్ని బలోపేతం చేసి, ఫిర్యాదులను తగ్గించి, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా చేయడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఆర్ఓ హరి సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.





అభివృద్ధి పథంలో జూబ్లీహిల్స్

- నియోజకవర్గ అభివృద్ధికి రూ.200 కోట్ల కేటాయింపు
- షేక్పేట్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరిస్తా
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్
- ఓయూ కాలనీలో పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం, జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 5: షేక్పేట్ డివిజన్ ఓయూ కాలనీలో రూ.1 కోటి 3 8లక్షల వ్యయంతో డ్రైనేజీ, వాటర్ లైన్ పనులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గురువారంశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో జూబ్లీహిల్స్ ప్రాంతం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి 200 కోట్ల రూపాయలను జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. షేక్పేట్ డివిజన్‌లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, అలాగే డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. షేక్పేట్ డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా మలచడమే తమ లక్ష్యమని అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, షేక్పేట్‌ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఓయూ కాలనీ ప్రెసిడెంట్ రవికుమార్‌నాగుల, కాలనీ నాయకులు పర్మారెడ్డి, దర్గా రవి, వెంకటేశ్వర్, బషీర్, నయీముద్దీన్, కార్యకర్తలు, కాలనీవాసులు, జీహెచ్ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జనసైనికులతో పవన్‌భేటీ

- మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్దేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 5: మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, తెలంగాణ జనసేన నాయకులతో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. 7,8 తేదీల్లో జన సేన పార్టీ అభ్యర్థులకు, అలాగే బీజేపీ పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్‌తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్‌గౌడ్, రాజలింగం, ఆర్కే సాగర్, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ప్రవీణ్‌కు ఇవ్వండి

- ఎమ్మెల్యే శంకర్ ఇంటింటి ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ప్రచారంతో జోష్



ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 5: షాద్‌నగర్ మున్సిపాలిటీ 7వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కొప్పునూరు ప్రవీణ్‌కు ఊహించని స్థాయిలో ఆదరణ లభిస్తోంది. గురువారం సాయంత్రం 7 వార్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత శ్యాం సుందర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలిసి అభ్యర్థి ప్రవీణ్‌ను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రజలు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్‌మాట్లాడుతూ గత రెండు సార్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారని, అయినా కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రవీణ్ ప్రోద్బలంతో షాద్ నగర్ మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనిపిస్తున్నదని, "ఒక్క అవకాశం ప్రవీణ్‌కు ఇవ్వండి.. అభివృద్ధి మీ కళ్లముందే కనిపిస్తుంది" అని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఎమ్మెల్యేగా నేనున్నానని, నాకు తోడుగా ప్రవీణ్ ను గెలిపిస్తే కాలనీలో అంతర్గత రోడ్లు, మురుగునీటి కాల్వలను నిర్మాణం చేస్తామని ప్రజలకు వివరించారు. సూర్య కాలనీలో ఇందిరమ్మ లబ్ధిదారుతో ఎమ్మెల్యే శంకర్ ముచ్చటించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో అతి పెద్ద వార్డు 7వ వార్డు అని, ఈ వార్డులో కనీస వసతులు లేవని, వీటన్నింటిని పూర్తి చేస్తామని, అందుకు ఎన్నికల తర్వాత ప్రణాళికలు తయారు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. "ప్రవీణ్‌ను గెలిపించండి..7వ వార్డు అభివృద్ధి బాధ్యత నాది అని ప్రతాప్ రెడ్డి తెలిపారు. మీ ఆలనీల అభివృద్ధికి నేను హామీ" అంటూ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డుకు చెందిన మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేతలు, యువజన, మహిళా కాంగ్రెస్‌నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



మరోమారు కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 5: మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని మోయినాబాద్ మున్సిపాలిటీలో 5, 6, 7, 8 అజీజ్‌నగర్ వార్డులలో నిర్వహించిన రోడ్‌షో మరియు గడపగడప ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చిందా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు 420 హామీలు ఇచ్చి, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆనాడు ప్రవేశపెట్టిన పథకాలే నేటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకున్న ఏకైక నాయకుడు కేసీఆర్ గారేనని, రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ గారి ప్రభుత్వమే రానుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెడుతూ, అరిచేతిలో స్వర్గాన్ని చూపిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తొస్తారని, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, అవస్థలను పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిస్తూ, కేసీఆర్ గారి నాయకత్వాన్ని మరింత బలపరుస్తూ మున్సిపాలిటీలో భారీ విజయాన్ని సాధిస్తామని సబితా ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి

- పాటి సుమలత జైపాల్ రెడ్డి



ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 5: ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి అని పాటి సుమలత జైపాల్ రెడ్డి అన్నారు . మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని వార్డు ప్రజలు ఆశీర్వదించి ఆదరించండి అని విజ్ఞప్తి చేశారు . వార్డులో సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యతనని వెల్లడించారు మౌలిక వసతులు ఏర్పాటుకు మొదటి ప్రాధాన్య ఇస్తా ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలతో పాటు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. వార్డులో ఉన్న మౌలిక వసతులను ఏర్పాటుకు కృషి చేస్తారని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పోటీలో ఉన్నానని హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వార్డు ప్రజలకు కోరారు వీధిలైట్లు సిసి రోడ్లు అండర్ డ్రైనేజ్ పనులను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తానన్నారు. మహిళా సాధికారకొరకు వడ్డీ లేని రుణాలను డ్వాక్రా మహిళలకు అందిస్తుందన్నారు మహిళల కొరకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా వార్డుగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేస్తా

- 15వ వార్డు అభ్యర్థి సంధ్య సురేష్ యాదవ్



ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 5: ప్రజలు అవకాశం ఇచ్చి గెలిపిస్తే వార్డు అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి సంధ్య సురేష్ యాదవ్ అన్నారు. గురువారం 15 వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి అభ్యర్థి సంధ్య సురేష్ యాదవ్ జోరుగా ప్రచారం నిర్వహించారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు. మీలో ఒకడిగా.. మీ కష్టసుఖాలు తెలిసిన వాడిగా మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు పథకాలు అమలు చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందాయి అన్నారు. ప్రజలంతా మరోసారి కెసిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజలంతా బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.



సీఎం రేవంత్ గతేడాది ప్రతినెలా ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి, నెలకు ఒక స్కామ్ చేశారు. జనవరిలో సివిల్ సప్లైస్, ఫిబ్రవరిలో ఎన్టీపీసీ ఫ్లై యాష్, మార్చిలో సాండ్, ఏప్రిలో ఆర్టీసీ, మేలో అమృత్ టెండర్లు, జూన్‌లో ఫోర్త్ సిటీ, జులైలో లగచర్ల ల్యాండ్, ఆగస్టులో పీజీ మెడికల్ సీట్లు, సెప్టెంబర్‌లో హిల్టిప్, అక్టోబర్‌లో విద్యుత్, నవంబర్లో సింగరేణి, డిసెంబర్‌లో కేఎల్ఎస్ఆర్ స్కామ్ చేశారు.

- బీఆర్ఎస్ నేత హరీష్‌రావు

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
శుక్రవారం
06.02.2026
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

యూజీసీ మార్గదర్శకాలపై న్యాయ, సామాజిక ఘర్షణ

భారతదేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుని 'వికసిత్ భారత్' వైపు అడుగులు వేస్తున్న వేళ, మన ఉన్నత విద్యా సంస్థల గడపల వద్ద ఇంకా కుల వివక్ష రక్కసి కోరలు చాచి ఉండటం జాతికే సిగ్గుచేటు. విజ్ఞాన శాస్త్రంలో విశ్వగురువులుగా ఎదగాలని కలలు గంటున్న తరుణంలో, క్యాంపస్‌ల లోపల విద్యార్థుల ప్రతిభను వారి పుట్టుకతో కొలవడం ఒక సామాజిక వైఫల్యం. ఈ రుగ్మతను రూపుమాపడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకువచ్చిన కొత్త 'ఈక్విటీ మార్గదర్శకాలు' ఇప్పుడు న్యాయస్థానాల మెట్ల వద్ద నిలిచాయి. సామాజిక న్యాయం అందించాలనే తపన, చట్టపరమైన సమతుల్యత మధ్య తలెత్తిన ఈ ఘర్షణ విద్యా రంగంలో ఒక కొత్త చర్చకు తెరలేపింది. సుప్రీంకోర్టు ఈ నిబంధనలపై విధించిన స్టే, యూజీసీ చేస్తున్న ప్రయత్నాల్లోని అస్పష్టతను మరియు లోపాలను ఎత్తిచూపుతోంది. విద్యాసంస్థలు అనేవి కేవలం డిగ్రీలను ముద్రించే యంత్రాలు కావు; అవి రేపటి పౌరుల ఆలోచనా దృక్పథాన్ని నిర్మించే కర్మాగారాలు. అటువంటి చోట ఒక విద్యార్థి తన కులం కారణంగా చిన్నచూపుకు గురైతే, అది ఆ వ్యక్తి ఆత్మగౌరవంపై జరిగే దాడి మాత్రమే కాదు, రాజ్యాంగం కల్పించిన సమానత్వపు ఆశయానికి గొడ్డలి పెట్టు. ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలలో దళిత, గిరిజన విద్యార్థుల ఆత్మహత్యల పరంపర ఆగిపోవడం లేదు. ఇవి కేవలం మానసిక ఒత్తిడి వల్ల జరిగిన మరణాలు కావు, ఇవి వ్యవస్థీకృత సామాజిక బహిష్కరణల ఫలితం. రిజర్వేషన్ల ద్వారా వచ్చిన వారిని 'మెరిట్' లేని వారిగా ముద్ర వేయడం, ల్యాబ్ సెషన్లలో ఒంటరిని చేయడం, వైవా పరీక్షల్లో తక్కువ మార్కులతో వేధించడం వంటి సూక్ష్మ రూపాల్లో వివక్ష నేటికీ రాజ్యమేలుతోంది. ఈ అదృశ్య వేధింపులను అరికట్టడానికి యూజీసీ తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమే అయినప్పటికీ, ఆ నిబంధనల రూపకల్పనలో ప్రదర్శించిన తొందరపాటు ఇప్పుడు విమర్శలకు దారితీసింది. న్యాయస్థానం లేవనెత్తిన ప్రధాన అభ్యంతరం చట్టం యొక్క దుర్వినియోగం గురించి. గతంలో ఉన్న నిబంధనలలో తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేది. కానీ కొత్త ముసాయిదాలో ఆ రక్షణ కవచాన్ని తొలగించడం వల్ల, ఇది అగ్రవర్ణ విద్యార్థులపై లేదా ఫ్యాకల్టీపై కక్షసాధింపు చర్యలకు ఒక సాధనంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. చట్టం అనేది ఎప్పుడూ ఒక బాధితుడిని రక్షించాలే తప్ప, మరొకరిని ముందే నిందితుడిగా చూడకూడదు. "నిరపరాధికి శిక్ష పడకూడదు" అనే న్యాయ సూత్రం ఇక్కడ ప్రశ్నార్థకమైంది. వివక్షను అరికట్టడం అంటే ఒక వర్గంపై మరొక వర్గం ఆధిపత్యాన్ని చెలాయించడం కాదు, అందరికీ సమానమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం. ఈ విషయంలో యూజీసీ సమతుల్యతను కోల్పోయిందని, ఒక వర్గం ఆందోళనలను పూర్తిగా విస్మరించిందని పిటిషనర్ల వాదనలో బలం ఉంది. అప్పట్లో రిజర్వేషన్లు అంటే కేవలం ఉద్యోగాల కోటా మాత్రమే అనుకున్నారు, కానీ అవి సామాజిక గౌరవానికి చిహ్నాలని కాలం నిరూపించింది. నేడు యూజీసీ మార్గదర్శకాలు కూడా అలాంటి ఒక విప్లవాత్మక మార్పు కోసమే ఉద్దేశించబడ్డాయి. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మరియు 16 మధ్య ఉన్న సన్నని గీతను అర్థం చేసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. వివక్షను నిర్వచించడంలో ఉన్న అస్పష్టత వల్ల, సాధారణ విమర్శలు కూడా వేధింపుల కిందకు వచ్చే ప్రమాదం ఉంది. ఇది క్యాంపస్‌లలో విద్యార్థుల మధ్య స్వేచ్ఛాయుతమైన చర్చలను, భిన్నాభిప్రాయాలను చంపేసి, కేవలం భయంపై ఆధారపడిన నిశ్శబ్దాన్ని నెలకొల్పుతుంది. యూజీసీ చేయాల్సింది కేవలం శిక్షలను పెంచడం కాదు, ఆ వ్యవస్థను ప్రజాస్వామ్యీకరించడం. ఫిర్యాదు అందిన వెంటనే నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా, అందులో నిపుణులు మరియు వివిధ వర్గాల ప్రతినిధులు ఉండేలా చూడాలి. అలాగే, ఫిర్యాదుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలి. సుప్రీంకోర్టు విధించిన స్టే యూజీసీకి తన తప్పులను సరిదిద్దుకోవడానికి ఒక సువర్ణావకాశం. చట్టం ఏకపక్షంగా ఉంటే అది వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. అగ్రవర్ణ విద్యార్థులలో ఉన్న అభద్రతా భావాన్ని, వెనుకబడిన వర్గాలలో ఉన్న వివక్షా భయాన్ని రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఒక మధ్యేమార్గ మార్గదర్శకాన్ని రూపొందించాలి. విద్యాలయాలు రాజకీయం చేసే స్థలాలు కాకూడదు, అవి మేధోమథనం చేసే కేంద్రాలు కావాలి. కులం అనే మురికిని క్యాంపస్‌ల బయటే వదిలేసి, ప్రతిభ మరియు మానవత్వం ప్రాతిపదికన విద్యార్థులు ఒకరినొకరు గౌరవించుకునే రోజు వచ్చినప్పుడే యూజీసీ ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. భారతీయ యువత తన మేధస్సుతో ప్రపంచాన్ని శాసించాలంటే, ముందుగా మన క్యాంపస్‌లలో ఉన్న ఈ మధ్యయుగపు వివక్షా సంకెళ్లను తెంచుకోవాలి.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
06.02.2026

యూపీఐ విజయోత్సాహంతో యూఎల్ఐ ప్రవేశపెట్టిన ఆర్బీఐ

యూపీఐ వ్యవస్థ దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ఎలా విప్లవాత్మకంగా మార్చిందో అదే విధంగా చిన్న వ్యాపారాలు (ఎంఎస్ఎంఇ), గ్రామీణ రుణగ్రహీతలు, సూక్ష్మ రుణగ్రహీతలకు (మైక్రో బారోవర్స్)కు, కౌలుదారు రైతులకు ఋణ సదుపాయాలను సులభతరం చేయడానికి ఈ వ్యవస్థ ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ వ్యవస్థ డాక్యుమెంటేషన్‌ను, రుణ అంచనా సమయాలను తగ్గించడం మరియు విభిన్న డేటా వనరులను సమగ్రపరచడం ద్వారా వేగవంతమైన రుణ సదుపాయాలను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.



యేచన్ చంద్ర శేఖర్
8885050822

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పిసిఐ) ద్వారా అభివృద్ధి చేయబడిన మొబైల్ ఫోన్ల ద్వారా అప్పటికప్పుడు తక్షణమే రియల్‌టైమ్ ఇంటర్‌బ్యాంక్ చెల్లింపులను ప్రారంభించడానికి రూపొందించబడిన వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ)ను ఏప్రిల్ 11, 2016న అప్పటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ డాక్టర్ రఘురామ్ రాజన్ ముంబైలో అధికారికంగా ప్రారంభించిన విషయం మనందరికీ తెలుసు. అనతికాలంలోనే పుంజుకున్న ఈ వ్యవస్థ భారతదేశానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తీసుకువచ్చింది. డిసెంబర్ 31, 2025 నాటికి, భారతదేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) రికార్డు స్థాయిలో పనితీరును సాధించి, భారీ వృద్ధిని నమోదు చేసింది. కేవలం డిసెంబర్ 2025లోనే, 21.63 బిలియన్ల లావాదేవీల ద్వారా మొత్తం రు.28 లక్షల కోట్ల వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించింది. అంతేకాదు, 2025 చివరి నాటికి, భారతీయ ప్రయాణికులు ఫోన్‌పే, పేటీఎం మరియు గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూఆర్‌కోడ్ ఆధారిత చెల్లింపులు చేయడానికి భూటాన్, సింగపూర్, ఖతార్, మారిషస్, నేపాల్, యూఏఈ, శ్రీలంక మరియు ఫ్రాన్స్ దేశాలు వెసులుబాటు కల్పించడం విశేషం. యుపిఐ సాధించిన విజయోత్సాహంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా "యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్" (యుఎల్ఐ) ను ప్రవేశాపెట్టింది.

ఎవరి కోసం యుఎల్ఐ?

రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్బీఐహెచ్) యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యుఎల్ఐ) అనే నూతన వ్యవస్థను అభివృద్ధి చేయగా, దీనిని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆగస్టు 26, 2024న ప్రారంభించి దశలవారీగా దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ప్రణాళిక రచించారు. యుపిఐ వ్యవస్థ దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ఎలా విప్లవాత్మకంగా మార్చిందో అదే విధంగా చిన్న వ్యాపారాలు (ఎంఎస్ఎంఇ), గ్రామీణ రుణగ్రహీతలు, సూక్ష్మ రుణగ్రహీతలకు (మైక్రో బారోవర్స్)కు మరియు కౌలుదారు రైతులకు రుణ సదుపాయాలను సులభతరం చేయడానికి ఈ వ్యవస్థ ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ వ్యవస్థ డాక్యుమెంటేషన్‌ను, రుణ అంచనా సమయాలను తగ్గించడం మరియు విభిన్న డేటా వనరులను సమగ్రపరచడం ద్వారా వేగవంతమైన రుణ సదుపాయాలను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, దీని ప్రభావం ఈ సమూహాలకు మాత్రమే కాకుండా పెద్ద బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించని ఆర్థిక సంస్థలు) మరియు ఫిన్‌టెక్ కంపెనీలకు గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనాలను అందిస్తుంది. సెప్టెంబర్ 2022లో ప్రారంభమైన కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) రుణాల కోసం పైలట్ ప్రోగ్రామ్ విజయం ఆధారంగా యుఎల్ఐ వేగవంతమైన, డిజిటల్ మరియు చాలా వరకు కాగితరహిత రుణ మంజూరీల కోసం అభివృద్ధి చేయబడింది. డిసెంబర్



2024 నాటికి, ఈ వ్యవస్థ నుండి ఏపీఐల (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌ల)ను ఉపయోగించి రు.27,000 కోట్ల విలువైన 600,000 కంటే ఎక్కువ రుణాలను పంపిణీ చేశారు, ఇందులో రు.14,500 కోట్ల విలువైన 160,000 సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) రుణాలు కూడా ఉన్నాయి.

రుణదాతలకు సజావుగా సమాచార లభ్యత:

యుఎల్ఐ వ్యవస్థ ద్వారా రుణదాతలకు రుణగ్రహీతల యొక్క ఆర్థిక మరియు ఆర్థికేతర డిజిటలైజ్డ్ సమాచారం బహుళ డేటా సర్వీస్ ప్రొవైడర్ల (సమాచార సేవా సంస్థల) నుండి సులభంగా అందుబాటులో ఉండేలా చేస్తుంది. ఈ వ్యవస్థ ప్రభుత్వ డేటాబేస్‌లు (ఉదా: జీఎస్టీఎన్, భూమి రికార్డులు, వగైరా), ఉపగ్రహ చిత్రాలు మరియు ఆర్థిక రికార్డులు వంటి వివిధ వనరుల నుండి సమాచారాన్ని ఏకీకృతం చేసి ప్రామాణిక ఎపిఐ (అప్లికేషను ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్)ల ద్వారా రుణదాతలకు సులభంగా అందుబాటులో ఉంచుతుంది. ప్రత్యక్ష కాగితపు సమాచార (మాన్యువల్ డేటా) సేకరణ వల్ల కలిగే సాంప్రదాయ జాప్యాలు లేకుండా రుణదాత సమాచారాన్ని రుణగ్రహీత సమాచారాన్ని రుణదాత త్వరగా అంచనా వేసేందుకు ఇది చాలా సౌలభ్యంగా ఉంటుంది. ఇది రుణదాతలకు అత్యంత సూక్ష్మమైన సమాచారాన్ని తనిఖీ చేసుకునేందుకు వీలు కల్పించి రుణగ్రస్తుల ఆర్థిక మరియు రుణ చెల్లింపు స్తోమతను వేగంగా మరియు ఖచ్చితంగా మదింపు వేసేందుకు (క్రెడిట్ అసెస్‌మెంట్) ఉపకరిస్తుంది. రుణ మొత్తం అంచనా వేయడం నుండి రుణ ఒప్పంద అమలు మరియు రుణ పంపిణీ వరకు మొత్తం అన్ని దశలను డిజిటల్ మాధ్యమంలో సురక్షితంగా, సమర్థవంతంగా మరియు చట్టబద్ధంగా పూర్తి చేయవచ్చు.

కస్టమర్ (రుణగ్రస్తుల) ఆన్‌బోర్డింగ్ క్రమబద్ధీకరణ:

యుఎల్ఐ వ్యవస్థ యొక్క విభిన్న డేటా వనరుల ఏకీకరణ ద్వారా పాన్ కార్డు వివరాలు, డిజిలాకర్ పత్రాలు మరియు భూమి రికార్డులు వంటివి మానవరహిత జోక్యంతో అందుబాటులో ఉండడం వలన ధృవీకరణ ప్రక్రియలో ఎక్కువ భాగాన్ని ఆటోమేటిక్ గా పూర్తి చేసేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఇది మానవ జోక్యాన్ని తగ్గించి ఆన్‌బోర్డింగ్‌ను క్రమబద్ధీకరించి ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. ఇది పరిపాలనాపరమైన పనులు మరియు లోపాలను తగ్గించడంలో దోహదపడుతుంది. సమగ్రమైన మరియు ధృవీకరించబడిన రుణగ్రస్తుల సమాచారం అధీకృత వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉండడంతో రుణదాతలు వారి రిస్క్ నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతేకాకుండా, ఇది మోసపూరిత దరఖాస్తులు మరియు రుణ ఎగవేతల సంభావ్యతను తగ్గిస్తుంది. రుణ ప్రక్రియలోని వివిధ అంశాలను ఆటోమేట్ చేయడం ద్వారా పెద్ద రుణ సంస్థల నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఫలితంగా మెరుగైన కార్యాచరణ సామర్థ్యంతో రుణాల మంజూరీ మరియు చెల్లింపులు వేగవంతంగా పూర్తిచేయడానికి మార్గం సుగమం చేస్తుంది.

సవాళ్లు:

యుఎల్ఐ వ్యవస్థ గణనీయమైన సామర్థ్యాన్ని అందిస్తున్నప్పటికీ, కొన్ని నష్టాలను కూడా చవిచూడాల్సి ఉంటుంది. వేగవంతమైన రుణ ఆమోదం మరియు పంపిణీ, ప్రత్యేకించి ఇప్పటివరకు రుణ సేవలు అంతగా అందని మార్కెట్లలో రుణ ఎగవేతలకు దారితీయవచ్చు. దీర్ఘకాలిక స్థిరత్వాన్ని నిర్ధారించుకోవడానికి రుణదాతలు తమ రిస్క్ నిర్వహణ ప్రక్రియలను పటిష్టపరచుకోవాల్సి ఉంటుంది. సమాచార గోప్యత (డేటా ప్రైవసీ) ఒక ఆందోళనకరమైన అంశం. యుఎల్ఐ ద్వారా సులభంగా అందుబాటులో ఉండే పాన్ కార్డుల వివరాలు మరియు ఆర్థిక రికార్డుల వంటి సమాచార దుర్వినియోగాన్ని నిరోధించడానికి బలమైన సమాచార భద్రతా చర్యలు అవసరం. వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ రుణ పర్యావరణ వ్యవస్థలో యుఎల్ఐని ముందస్తుగా స్వీకరించడం పెద్ద రుణ సంస్థలకు, ఒక వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తుంది. ఈ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా, సంస్థలు వారి కార్యకలాపాల పరిధిని విస్తృత పరచుకోవడంతో పాటు భారతదేశం యొక్క ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించవచ్చు.

(వ్యాసకర్త మాజీ రాష్ట్ర కార్యదర్శి, ది భారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ, హైదరాబాద్)

రుతుక్రమ ఆరోగ్యం.. ప్రాథమిక హక్కు!!



వెంక గారి భూమయ్య
9848559863

భారత అత్యున్నత న్యాయస్థానం ఋతుక్రమ ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా ప్రకటించి, దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఉచిత శానిటరీ సౌకర్యాలను కల్పించాలని ఆదేశించినప్పుడు, అది కేవలం ఒక సాధారణ తీర్పుగా మాత్రమే మిగిలిపోలేదు. దశాబ్దాలుగా సామాజిక వివక్షకు గురవుతున్న కోట్లాది మంది పౌరుల పట్ల జరుగుతున్న ఒక దీర్ఘకాలిక అన్యాయాన్ని సరిదిద్దే దిశగా ఇది ఒక నైతిక హెచ్చరికగా నిలిచింది. చాలా కాలంగా మన సమాజంలో ఋతుక్రమం అనేది కేవలం ఒక వ్యక్తిగత ఇబ్బందిగా, రహస్యంగా ఉంచాల్సిన అపరాధంగా, లేదా పారిశుద్ధ్యానికి సంబంధించిన అంశంగా మాత్రమే పరిగణించబడింది. కొన్ని సందర్భాల్లో ఇది కేవలం దానధర్మంగా లేదా సేవా కార్యక్రమంగా చూడబడింది. కానీ, ఈ చారిత్రాత్మక తీర్పు ద్వారా ఇది రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద ప్రతి వ్యక్తికి లభించే గౌరవం, శారీరక స్వయంప్రతిపత్తి మరియు సమాన అవకాశాలకు సంబంధించిన ప్రాథమిక హక్కు అని స్పష్టమైంది. ఈ చట్టపరమైన గుర్తింపు ఎంత గొప్పదైనప్పటికీ, అసలైన పరీక్ష ఈ తీర్పును సామాన్య ప్రజల దైనందిన జీవితాల్లో వాస్తవిక మార్పుగా మార్చడంలోనే దాగి ఉంది. భారతదేశం వంటి విశాలమైన దేశంలో ఋతుక్రమం అనేది వందల మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేసే అంశం. గణాంకాలను పరిశీలిస్తే, మన దేశంలో సుమారు 39.3 కోట్ల మంది ఋతుక్రమం పొందే వ్యక్తులు ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో ఉన్న పౌరుల అవసరాలను తీర్చాలంటే మన ప్రభుత్వ విధానాలు కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చేవిగా ఉండకూడదు. అవి హక్కుల ఆధారితమైనవిగా, వ్యవస్థాగతమైనవిగా మరియు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుపోయేలా ఉండాలి. ఆచరణలో ఈ తీర్పు విజయవంతం కావాలంటే మొదటగా మన సరఫరా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి. ప్రస్తుతం పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్ల సరఫరా చాలా తక్కువగా ఉంది. కేవలం ప్యాడ్లు అందించడమే కాకుండా, పునర్వినియోగపరచదగిన మరియు పర్యావరణానికి తక్కువ హాని చేసే ఎంపికలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఇటువంటి ఉత్పత్తులను తయారు చేసే చిన్న చిన్న సంస్థలకు మరియు స్టార్టప్‌లకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించాలి, తద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అందరికీ ఇవి సరసమైన ధరలకే లభిస్తాయి. ఋతుక్రమ ఆరోగ్యాన్ని కేవలం పారిశుద్ధ్యం అనే ఒక చిన్న పరిధిలో బంధించకూడదు. ఇది ఆరోగ్య వ్యవస్థలు, విద్యా విధానం, కార్మిక చట్టాలు మరియు విపత్తు నిర్వహణ ప్రణాళికల్లో అంతర్భాగం కావాలి. కేవలం ఒకే మంత్రిత్వ శాఖపై భారం వేయకుండా కార్మిక, ఆరోగ్య మరియు విద్యా శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం ఏర్పడాలి.



తద్వారా క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించవచ్చు. దీనికి తోడు, ఋతుక్రమ సంబంధిత రుగ్మతలను గుర్తించడం మరియు వాటికి చికిత్స అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా మారాలి. ముఖ్యంగా పిసిఓఎస్ (PCOS), ఎండోమెట్రియోసిస్ వంటి తీవ్రమైన సమస్యల గురించి అవగాహన కల్పించి, ఆరోగ్య కేంద్రాల ద్వారా తగిన సేవలు అందించాలి. విద్య పరంగా చూస్తే, ఈ అవగాహన అనేది చిన్న వయస్సు నుంచే ప్రారంభం కావాలి. కనీసం ఏడు నుండి ఎనిమిది ఏళ్ల వయస్సు నుంచే బాలబాలికలకు పాఠశాలల్లో ఋతుక్రమ విద్యను బోధించాలి. దీనివల్ల బాలికలు తమ మొదటి ఋతుక్రమం సమయంలో భయాందోళనలకు గురికాకుండా ఉంటారు. బాలురను కూడా ఈ అవగాహనలో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో నెలకొన్న సిగ్గు మరియు సామాజిక వివక్షను సమూలంగా తొలగించవచ్చు. కేవలం ఉత్పత్తులను అమ్ముకోవడం కోసం చేసే ప్రకటనల కంటే, ప్రవర్తనా మార్పు తీసుకువచ్చే వ్యూహాలను రూపొందించడం అత్యవసరం. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే సమ్మిళితత్వం. ఋతుక్రమం పొందే వారందరినీ ఒకే కోణంలో చూడటం సరికాదు. పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, నాన్‌బైనరీ వ్యక్తులు మరియు మెనోపాజ్ దశకు చేరుకున్న కార్మికులు... వీరందరికీ భిన్నమైన అవసరాలు ఉంటాయి. ప్రభుత్వం సేకరించే ఏ డేటా అయినా వైకల్యం, కులం మరియు లింగ గుర్తింపు ఆధారంగా విభజించబడి ఉండాలి. అప్పుడే ప్రతి వర్గానికి సరైన న్యాయం జరుగుతుంది. విపత్తుల సమయంలో, అంటే వరదలు వచ్చినప్పుడు లేదా తీవ్రమైన నీటి కొరత ఉన్నప్పుడు, ఋతుక్రమ అవసరాలు అస్సలు పట్టించుకోబడవు. ఇటువంటి అత్యవసర సమయాల్లో కూడా ఋతుక్రమ ఆరోగ్య అవసరాలను విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఒక ప్రాధాన్యత అంశంగా గుర్తించాలి. ఈ మార్పులన్నీ జరగాలంటే పీరియడ్స్ సమస్యను కేవలం 'దానధర్మం'తో పరిష్కరించలేము. దీనికి పటిష్టమైన ప్రజా ఆరోగ్య వ్యవస్థలు, శిక్షణ పొందిన నిపుణులు మరియు చట్టబద్ధమైన హక్కులు అవసరం. కోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కేవలం ఒక ఆశగా మిగిలిపోకూడదు. పార్లమెంటు దీనిని అమలు చేయదగిన చట్టంగా మార్చాలి. శానిటరీ మౌలిక సదుపాయాలు, నిధుల కేటాయింపు మరియు వివిధ శాఖల జవాబుదారీతనం ఉండేలా చూడాలి. ఋతుక్రమ ఆరోగ్యం అనేది పౌరులు అడుక్కోవాల్సిన దానధర్మం కాదు, అది వారు గర్వంగా క్లెయిమ్ చేయగల హక్కుగా మారాలి. ఋతుక్రమాన్ని గౌరవంగా చూసే, నొప్పికి సరైన చికిత్స లభించే, మరియు ప్రతి పౌరుడి శారీరక స్వయంప్రతిపత్తిని ప్రభుత్వం కాపాడే కొత్త అధ్యాయాన్ని మనం మొదలుపెట్టాలి. అది మనం పౌర సమాజానికి నిలబెట్టుకోవాల్సిన వాగ్దానం. గౌరవప్రదమైన ఋతుక్రమ ఆరోగ్యం అనేది కేవలం ఒక వ్యక్తిగత విషయం కాదు, అది ఒక దేశ గౌరవానికి చిహ్నం. అందుకే ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. న్యాయస్థానం చూపిన మార్గంలో పయనిస్తూ, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే మన ముందున్న అసలైన లక్ష్యం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

అగ్రకుల పార్టీల సామాజిక న్యాయం ఒక భ్రమ



సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారత రాజ్యాంగం పరిపాలనా నియమావళి మాత్రమే కాదు, శతాబ్దాలుగా కొనసాగిన కుల ఆధారిత అసమానతలను తొలగించి, అణగారిన వర్గాల్లో వెలుగు నింపే సామాజిక విప్లవ పత్రం. రాజ్యాంగ నిర్మాణానికి కేంద్ర బిందువు "సామాజిక న్యాయం". ఇది వ్యక్తుల మధ్య చట్టపరమైన సమానత్వంతో పాటు సమాజంలో పాతుకుపోయిన నిర్మాణాత్మక అసమానతలను సరిదిద్దడమే దీని లక్ష్యం. భారతదేశంలో ఇప్పటివరకు అగ్రవర్ణ పార్టీలన్నీ సామాజిక న్యాయం పేరుతోనే అధికారంలోకి వచ్చాయి. అనేక పథకాలు, ప్రకటనలతో సామాజిక సమానత్వం దిశగా అడుగులు వేస్తున్నట్లు భ్రమ కల్పించారు. గరీబ్ హటావో పేరుతో కాంగ్రెస్ పార్టీ, అంత్యోదయ పేరుతో బిజెపి, సమసమాజం పేరుతో పలు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేపట్టాయి. కానీ సామాజిక న్యాయం నెరవేరలేదు. ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది రేషన్ బియ్యం మీద ఆధారపడి జీవిస్తున్నారు అంటేనే సామాజిక న్యాయ వైఫల్యానికి సజీవ సాక్ష్యం. తెలంగాణ టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రానికి మొదట దళిత ముఖ్యమంత్రినీ చేస్తానని చెప్పి మాట తప్పడం కూడా సామాజిక న్యాయానికి పాతరేసినట్టే. ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన విషయం..."సమ సమాజం, సమానత్వం అని అగ్రకుల నాయకుడంటే దోపిడి చేయడానికి బయలుదేరుతున్నాడని అర్థం, అదే మాట బహుజన నాయకుడు అంటే దోపిడి కులాల మీద యుద్ధానికి బయలుదేరుతున్న యోధుడని అర్థం". ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో అణగారిన వర్గాల చుట్టూ అలుముకున్న చీకటిని తరమడానికి డాక్టర్ విశారదన్ మహారాజ్ బయలుదేరాడు.

సబ్బండ కులాల రాజ్యాంగ హక్కులను వ్యతిరేకించడమే

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధికి అడుగులు వేస్తున్నట్లు ప్రయత్నించింది. 2024 ఫిబ్రవరి 4న కులగణన చేయాలని క్యాబినెట్ లో తీర్మానం చేశారు. 2025 ఫిబ్రవరి 4 కులగణనపై చర్చించారు. మరోవైపు అదే రోజు షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణ సిఫార్సులను తెలంగాణ ప్రభుత్వం ఆమోదించారు. ఈ అంశాలను పురస్కరించుకొని సమానత్వం, సాధికారత వైపు నడిపించడానికి గతేడాది ఫిబ్రవరి 4వ తేదీన "తెలంగాణ సామాజిక దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఆ ప్రత్యేక దినం గురించి ఊసెత్తకపోవడం గమనార్హం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అయ్యాయి అనే అంశం పట్ల చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. జనాభా ప్రకారం అందరికీ సమాన అవకాశాలు కల్పనే సామాజిక న్యాయం. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కులగణన నిర్వహించి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇది సబ్బండ కులాల చారిత్రక అన్యాయాన్ని సరిచేసే ఒక అధికారిక అంగీకారం. కానీ చట్టరూపం దాల్చి, క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లోనే ఉండడమే దీనికి నిదర్శనం. మరోవైపు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి తెచ్చిన జీవో సైతం న్యాయవివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. నిబద్ధత లేని బీసీ రిజర్వేషన్ల బిల్లు తేవడమే దీనికి ప్రధాన కారణం.

బహుజన పార్టీలు అధికారంలోకి రావడమే విప్లవం.

బీసీ రిజర్వేషన్లు తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి పెద్ద ఎత్తున ఉద్యమించింది. ఈ ఉద్యమం బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్, ఉమ్మడి ఏపీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బాలగోని బాలరాజు గౌడ్ గారి నేతృత్వంలో జరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ అంశం పక్కన పెట్టి పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఈ బీసీ ఉద్యమ ప్రభావంతో బీసీ ఎస్సీ ఎస్టీలు 86.4 శాతం సర్పంచ్ లుగా గెలవడం భారతదేశంలో అతి పెద్ద బహుజనుల సామాజిక విజయం. ఈ బహుజన పార్టీలు ఏమి చేయలేదని, అభివృద్ధి జరగలేదని అగ్రకుల పార్టీలు ప్రచారం చేస్తున్నారు. వాళ్ల ఉచ్చులో దళిత బహుజనులు పడి దారి తప్పుతున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. అసలు ఈ దేశంలో వేల ఏళ్లుగా వెనబడిన బహుజన పార్టీలు అధికారంలోకి రావడమే పెద్ద విప్లవం. బహుజన పార్టీలు అధికారంలో ఉన్నపుడు అట్టడుగు వర్గాల అభివృద్ధి జరగలేదనడం విడ్డూరం. తెలంగాణలో బీసీ-ఎస్సీ-ఎస్టీల హక్కులు, రాజ్యాధికార సాధన కోసం లక్ష కిలోమీటర్ల రథ యాత్ర చేస్తున్న డాక్టర్ విశారదన్ మహారాజ్ గారి "మా భూమి యాత్ర" సామాజిక న్యాయ పోరాటంలో మరో కీలక మలుపు. బహుజనుల భవిష్యత్తు కోసం సాగుతున్న రాజకీయ యుద్ధం.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

రేవంత్ రెడ్డి.. శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా?

- కరీంనగర్ కు రూ.1400 కోట్లు విడుదల చేశానని చెప్పడం పెద్ద జోక్
- మండిపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో కరీంనగర్ కు రూ.1400 కోట్లు ఇచ్చానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సీఎంకు నిజంగా దమ్ముంటే ఆ నిధులు ఎప్పుడు ఇచ్చారు? ఏయే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు? అనే వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'నన్ను కోసినా నయాపైసా లేదు'అని పదేపదే చెప్పిన రేవంత్ రెడ్డికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో కేసీఆర్, కేటీఆర్ లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని కేంద్రాన్ని నిందించడం విచిత్రంగా ఉందన్నారు. ''రేవంత్ రెడ్డిగారు... మీలో రోశం, పౌరుషం చచ్చిపోయిందా? కేసీఆర్ పంపే మూటలతోనే ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా? అందుకే ఆ కుటుంబాన్ని అరెస్ట్ చేయలేకపోతున్నానని ఒప్పుకుంటే చెప్పండి... కేసీఆర్ కుటుంబం సంగతి మేం చూస్తాం. మా భుజం మీద తుపాకీ పెట్టి ఇతరులను కాలుద్దామంటే... ఆ ట్రాప్ లో ఇరుక్కోవడానికి మేం సిద్ధంగా లేం. సీఎంకు రోషం, పౌరుషం చచ్చిపోయిందని ఒప్పుకుంటారా?. కేసీఆర్ పంపే మూటలను ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా? అందుకే కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయలేకపోతున్నానని ఒప్పుకుంటారా?. మీకు చేతగాదని ఒప్పుకుంటే కేసీఆర్ కుటుంబం సంగతి మేం చూస్తాం''అని అన్నారు. కరీంనగర్, వరంగల్ పట్టణాలను జంట నగరాలుగా మార్చి డంపింగ్ యార్డ్ ను తరలిస్తానని సీఎం చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. డంపింగ్ యార్డు తరలింపు కోసం కేంద్రం నుండి రూ.50 కోట్లు మంజూరు చేయించడంతోపాటు చెత్త బయో మైనింగ్ కోసం మరో రూ.18 కోట్లు విడుదల చేసినా... ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా కాంగ్రెస్ ప్రభుత్వమే అడ్డుకుంటోందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు బొమ్మకల్ అంబేద్కర్ విగ్రహంవద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. 6, 34 డివిజన్ల అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహించారు

కాంగ్రెస్ ఇచ్చింది 'గాడిద గుడ్డే'

- పొరపాటున కాంగ్రెస్‌ను గెలిపిస్తే పన్నుల మోత ఖాయం: కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రతిపక్షం బ్యూరో కరీంనగర్ /జమ్మికుంట, ఫిబ్రవరి 5: రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది గాడిద గుడ్డేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. పొరపాటున మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇంటి పన్ను, నల్లా పన్ను, వ్యాపార పన్నుల పెంపు ఖాయమని హెచ్చరించారు. ఖజానా కోసం రోడ్డు మీద నడిచినా ట్యాక్స్ వేసే పరిస్థితి వస్తుందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్, జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ ఎర్రం మహేశ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓట్లు వేయించుకున్నాయే తప్ప నయాపైసా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్‌పై కోపంతో కాంగ్రెస్‌కు ఓట్లేసినా జమ్మికుంటకు చిల్లిగవ్వ కూడా రాలేదన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ, అవ్వాతాతలకు రూ.4వేలు, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదని చెప్పారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జమ్మికుంట మున్సిపాలిటీకి ఏమిచ్చారని ప్రశ్నిస్తూ... "గాడిద గుడ్డు తప్ప ఇంకేమీ లేదు" అని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తే వెంటనే ప్రధాని వద్దకు వెళ్లి రూ.259 కోట్ల నిధులు తీసుకొచ్చామని తెలిపారు. జమ్మికుంట మున్సిపాలిటీకి 14వ, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.8.23 కోట్లు, అమృత్ పథకం ద్వారా రూ.33 కోట్లు, స్వనిధి పథకం ద్వారా రూ.8.45 కోట్లు తీసుకొచ్చినట్టు వివరించారు. ఖేలో ఇండియా ద్వారా సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు రూ.6.50 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. సీఎస్ఆర్, ఎంపీ లాడ్స్ నిధులతో జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి రూ.2 కోట్ల విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్స్ తీసుకొచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్లు, సిబ్బందిని నియమించలేదని మండిపడ్డారు. మంచి పాలన కోసం ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, జమ్మికుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని బండి సంజయ్ కుమార్ ప్రజలను కోరారు.

....అప్పులే మిగిలాయి

మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420కి పైగా హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, వాస్తవానికి పాడైపోయిన డొక్కు బస్సులను నడుపుతూ మహిళల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతోందని మండిపడ్డారు. తెలంగాణలోని 123 మున్సిపాలిటీలపై మొత్తం రూ.3,600 కోట్ల అప్పులు పేరుకుపోయాయని, అలాగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పు మాత్రమే రూ.5,000 కోట్లకు చేరిందని ఆయన వెల్లడించారు. అవినీతిని అరికట్టాల్సిన వ్యవస్థలే పూర్తిగా విఫలమయ్యాయని రాంచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఏసీబీ ద్వారా 1500 మంది అధికారులు లంచాలు తీసుకుంటూ పట్టుబడినప్పటికీ, వారిపై సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల అవినీతి మరింత పెరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.80,000 కోట్ల మేర కొత్త అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఓ వర్గం ఓట్ల కోసం దిగజారి అపీజ్‌మెంట్ పాలిటిక్స్ చేస్తోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "ముస్లిం ఈజ్ కాంగ్రెస్ కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అంటూ మాట్లాడటం ద్వారా కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలపై ఎంతగా ఆధారపడిందో స్పష్టంగా రుజువైందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అవినీతి, అప్పులు, పన్నుల భారం కావాలా? లేదా అభివృద్ధి, పారదర్శకత కావాలా? ప్రజలు ఆలోచించుకోవాలని తెలిపారు.

బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తు చేస్తాం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఈ 26 నెలల పాలనలో ఏం చేసిందో చెప్పాలని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఏమి చెప్తుందో చూడాలని, హైకోర్టు జడ్జీల ఫోన్లు, సినిమా హీరోయిన్ల ఫోన్లు, పత్రిక యజమానులు, పత్రిక రిపోర్టర్లు, రాజకీయ పార్టీ నాయకుల ఫోన్లు ట్యాప్ చేశారని అధికారికంగానే చెప్తున్నారని, చివరకు హైకోర్టు జడ్జీల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బహిరంగంగా అంగీకరిస్తున్నారని అన్నారు. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేసేంత దుర్మార్గపు పాలన బిఆర్ఎస్ హయాంలో కొనసాగింది. ఇంత తీవ్రమైన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఒక సాధారణ పోలీస్ ఆఫీసర్ తప్పుగా చూపిస్తూ, నిజమైన నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ వాస్తవానికి ఒకటే పార్టీలు అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలని, బిఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలి? కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలి? ఈ రెండు పార్టీలూ ఒకటే అన్న సత్యాన్ని ప్రజలు గుర్తించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.



కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 5 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సమక్షంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డిఇఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ గెలుపు కోసం కదిలిన జగ్గారెడ్డి కుటుంబం

- సంగారెడ్డిలో ప్రత్యేక ఆకర్షణ గా జయాచైతన్య రెడ్డి ఇంటింటి ప్రచారం

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 5: సంగారెడ్డి లో సభలు, సమావేశాలు, చేరికలు, ఇంటింటి ప్రచారం తో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హోరెత్తించారు. మున్సిపల్ ఎన్నికలకు కొన్ని రోజులే మిగిలి ఉండటంతో సంగారెడ్డి, సదాశివపేట నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రచార వేగాన్ని పెంచింది. జగ్గారెడ్డి కూతురు జయాచైతన్య రెడ్డి, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారం లో పాల్గొన్నారు. జయాచైతన్య రెడ్డి సంగారెడ్డి పట్టణం లోని 21,19,29,8,27 వ వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఇల్లుల్లు తిరుగుతూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ జయాచైతన్య రెడ్డి అందరినీ ఆకర్షించారు. ప్రచారం సందర్భంగా జయారెడ్డికి ప్రజలు తమ సమస్యలను వివరించారు. మీకు జగ్గారెడ్డి ఉన్నారు, ధైర్యంగా ఉండండి అంటూ ప్రజలకు భరోసా కల్పించారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, సంగారెడ్డి పట్టణం అభివృద్ధి లో ముందుకు సాగాలి అంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డి పట్టణం లోని 24,25,26,05,38 వ వార్డులలో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ లోని 38 వార్డులలో అన్ని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

సదాశివపేట లో జగ్గారెడ్డి సుడిగాలి పర్యటన

సదాశివపేటలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. సదాశివపేట శంభు లింగేశ్వర ఆలయం మొదలుకుని దుర్గమ్మ గుడి, గాంధీ చౌక్, శాస్త్రి రోడ్, బస్టాండ్, సుభాష్ రోడ్, తిలక్ రోడ్ గుండా పాదయాత్రగా తిరుగుతూ సందడి చేశారు. వ్యాపారులను,ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. గాంధీ చౌక్లో ఒక దుకాణంలో కూర్చుని కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రజల తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులకు పలు సూచనలు చేశారు. సదాశివపేట పట్టణం లోని 26 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ పర్యటన లో జగ్గారెడ్డి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, స్థానిక నాయకులు, చిరు, కంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




ఆటో నడిపిన మంత్రి పొన్నం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, హుస్నాబాద్, ఫిబ్రవరి 5: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని పెద్దమ్మ ఆలయం నుండి 6వ వార్డులో ఉన్న ఎల్లమ్మ ఆలయం వరకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఆటో నడుపుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆటోలో ప్రచారం చేయడం ద్వారా ఆయన సామాన్య ప్రజలతో తన అనుబంధాన్ని చాటుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అన్న సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవడం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

మేడారంలో గ్యాంగ్ రేప్ జరగలేదు

- మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ



ప్రతిపక్షం, ములుగు, ఫిబ్రవరి 5: మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్కసారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. మామిడితోటలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు యువకులు వాష్ రూమ్‌కు వెళ్లిన బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అనంతరం ఈ ఘటనకు కారణమైన యువకులు జంపన్నవాగు సమీపంలోని ఒక షాపులో దాక్కున్నారని, వారిని పోలీసులు తీసుకువెళ్లినట్లు ఆ వార్త కథనంలో పేర్కొన్నారు. ఈ వార్తను ఇప్పటికే ములుగు ఎస్పీ రామ్‌నాథ్ సుధీర్ కేకర్ ఖండించారు. అలాంటి ఘటన ఏదీ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్‌లోని సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ములుగు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి, కమిషన్‌కు నివేదిక అందజేయనుంది.



ఇండ్లు కోల్పోతున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్


ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 5: ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి మాడవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలతో డబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఇండ్లు కోల్పోతున్న వారు తమ అభిప్రాయాలను కలెక్టర్ కు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న తమకు మరొకచోట ఇండ్లు ఇవ్వాలని, కల్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రస్తుతం భద్రకాళి మాఢవీధుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సహకరిస్తున్నందుకు కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరపున ప్రయోజనాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్, మైనింగ్ ఏడి రవిశంకర్, జిడబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిరు శ్రీనివాస్, జీడబ్ల్యుఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఇతర అధికారులతోపాటు మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, ఇండ్ల నివాసులు పాల్గొన్నారు.



అదుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా

- రాచమల్ల అనిల్ గౌడ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 5 : ప్రజల సేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ అభివృద్ధికి బాటలు వసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాలని రాచమల్ల అనిల్ గౌడ్ కోరారు. ఇంద్రేశం మున్సిపల్ ఎన్నికలలో 14వ వార్డ్ అభ్యర్థిగా భారీ మెజార్ తో గెలిపించాలని కోరుతూ రాచమల్ల అనిల్ గౌడ్ ఇంటింట ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. ప్రచారంలో తనకు ప్రజల బ్రహ్మరథం పడుతున్న ప్రజలకు అనిల్ గౌడ్ కృతజ్ఞతలు తెలపారు.



అనుమతి తీసుకోని 'రాయలసీమ' లిఫ్ట్‌ను ఎన్జీటీ ఆపేస్తే దానిద్వారా ప్రజలను మభ్యపెట్టేందుకు వైపీపీ యత్నిస్తోంది. ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తాము నీళ్లిస్తాం. గోదావరి నీరు వృథాగా పోతోంది. అందులోని 200 టీఎంసీలు నల్లమలసాగర్‌కు తరలిస్తాం. 2014--19 మధ్య నీటి సంఘాలు చేపట్టిన పనులకు గత GOVT బిల్లులు ఇవ్వలేదు. వాటిని చెల్లిస్తాం. ఇకపై పనులు వాటికే ఇస్తాం.
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ప్రాంతీయం



సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులతో కలెక్టర్, సీపీ సమీక్ష

ప్రతిపక్షం, బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, జిల్లా అధికారులతో, సీఎంఓ కార్యాలయం నుంచి హాజరైన భద్రతా విభాగం అధికారులతో కలిసి గురువారం తుది ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిచ్పల్లి మండలం బర్ధీపూర్ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ తదితర ప్రాంతాలను నిశితంగా పరిశీలన చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు సీఎం కాన్వాయ్ కు ఎలాంటి అడ్డంకులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ సభకు వచ్చే వారి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఎంపిక చేసిన ప్రదేశంలోనే వాహనాలు నిలిపేలా చూడాలన్నారు. సీఎం సభకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, సభకు హాజరయ్యే వారికి తాగునీరు వంటి వసతులు కల్పిస్తూ, ప్రథమ చికిత్స సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీ.ఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోలీసు అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని అన్నారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, సీఎంఓ కార్యాలయ భద్రతా అధికారి మాధవరావు, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, ప్రకాష్, మస్తాన్ అలీ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎవరి మద్దతు లేకుండా మేయర్ సీట్ కైవసం చేసుకుంటాం

- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎవరి మద్దతు అవసరం లేకుండా మేయర్ సీటును కైవసం చేసుకుంటామని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్ లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి మంచి అనుకూల వాతావరణం ఉందని 60 డివిజన్లో 75 శాతం సీట్లు గెల్చుకొని ఒంటరిగానే మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామన్నారు. నిజామాబాద్ నగర ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని అన్నారు కాంగ్రెస్ పాలన పట్ల మధ్యతరగతి ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. అన్ని మతాలతో కలిసి ఉన్న నగరం నిజామాబాద్ అన్నారు. ప్రజలు శాంతి అభివృద్ధి కోరుకుంటున్నారు. రేవంత్ రెడ్డి సీఎం, భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గంలో అన్ని వర్గాలను తీసుకొని మంచి పాలన కొనసాగిస్తుందని, ఈ నిర్ణయాలతోనే మున్సిపల్ ఎన్నికలలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలవకుండా చిచ్చుపెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తారు వారి మాటలను నమ్మవద్దు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ప్రశాంతమైన నిజాంబాద్ ను పరిపూర్ణంగా అభివృద్ధి చేసుకుంటామన్నారు. తాము అభివృద్ధి చేస్తున్నాము కాబట్టి ఓట్లు అడుగుతున్నాము బిజెపి టిఆర్ఎస్ ఏం చేశారని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు బిజెపి ఏ ముఖం పెట్టుకొని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా ఎంపీ అరవింద్ బీసీలే కదా మోడీని బీసీ బిల్లు గురించి అడిగారా అని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 50 శాతం బీసీలకు సీట్లు ఇచ్చిందన్నారు. ప్రజలు క్షణిక ఆవేశాల పోకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. శుక్రవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం రేవంత్ రెడ్డి వస్తున్నారని ఈ సందర్భంగా నిజామాబాద్ బోధన్ ఆర్మూర్ లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హంధాన్, డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నూడ చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీతోనే సుస్థిర పాలన

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 5: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 58వ డివిజన్ అభ్యర్థి బొట్ల అనిత సత్యంలు గురువారం వారి ప్రచారాన్ని కోరెత్తించారు సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సుస్థిర పాలన అందిస్తుండగా రాష్ట్రంలో సైతం బిజెపి పాలన ఉంటే సుస్థిరమైన పాలన నుండి మెరుగైన అభివృద్ధి జరుగుతుందని 58వ కార్పొరేషన్ కి బొట్ల అనిత సత్యములు స్పష్టం చేశారు జిల్లా కేంద్రంలో మెయిన్ రోడ్ లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ వారు మాట్లాడారు ఈనెల 11న జరిగే పోలింగ్ నా బిజెపి పార్టీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తమకు గెలిపించాలని కోరారు 58 వ వార్డులో తామే గెలుస్తున్నట్లుగా ధీమా వ్యక్తం చేశారు తమను ప్రజలు గెలిపిస్తే కేంద్ర రాష్ట్ర పథకాలను ప్రజలకు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



సీఎం సభలో అస్వస్థతకు గురైన కార్పొరేటర్ అభ్యర్థి

- సర్దార్ ధన్నాసింగ్‌కు తక్షణ వైద్య సాయం
- మానవత్వం చాటిన వెలిచాల రాజేందర్ రావు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 5: కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు హాజరైన కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ 58వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సర్దార్ ధన్నాసింగ్ గురువారం సాయంత్రం అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు.ఈ విషయాన్ని వెంటనే గమనించిన కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, ధన్నాసింగ్‌ను తన స్వంత వాహనంలో చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బందితో దగ్గరుండి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం అంబులెన్స్ ఏర్పాటు చేసి కరీంనగర్లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడిన వెలిచాల రాజేందర్ రావు, ధన్నాసింగ్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ధన్నాసింగ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వెలిచాల రాజేందర్ రావును పలువురు కాంగ్రెస్ నాయకులు, ధన్నాసింగ్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వెలిచాల రాజేందర్ రావ్ తక్షణం స్పందించి మానవత దృక్పథం చాటుకోవడం విశేషం.



ప్రచారంలో దూసుకపోతున్న మేకల విజయ లక్ష్మి మల్లేష్ యాదవ్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5 : నగరంలోని 23వ డివిజన్ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేకల విజయలక్ష్మి మల్లేష్ యాదవ్ ప్రచారంలో ప్రత్యర్థులకు ధీటుగా దూసుకపోతున్నారు. ఇంటింటికి వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతున్నారు. మరో వారం రోజు ల్లోనే ఎన్నికలు ఉండడంతో ఆమె వార్డులో చేస్తున్న ప్రచారం ఊ పందుకుంది. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్నందున తనను గెలిపిస్తే డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇస్తున్నారు. దీనికి తోడు కేంద్రంలో అధికారంలో ఉండడం ఆమె గెలుపులో రెట్టింపు ప్రయోజనం చేకూర్చనుంది. ఆమె ప్రచార సరళి గెలుపు బాటలు వేస్తుందని పలువురు అంటున్నారు. ఇప్పటికే ఆమె గెలుపు ఖాయమైందని సైతం ఓటర్ల నుండి గుస గుసలు వినిపిస్తున్నాయి. ప్రచారంలో అందరికంటే ముందున్న ఆమె గెలుపులో సైతం అగ్రభాగాన ఉంటుందని పలువురు అంటున్నారు. డివిజన్ అభి వృద్దే ధ్యేయంగా ప్రచారం చే స్తున్న ఆమె మరింత అభివృద్ధి జరగాలంటే తన గెలుపు తప్పదన్న సంకేతాన్ని ఇ ప్పటికే ఓటర్లకు చేరేలా సంకేతాలు పంపారు. చురుగ్గా ఉంటూ జోరుగా ప్రచారం చేస్తుండడంతో ఇక ఆమె గెలుపును ఎవరూ ఆపలేరన్న అభిప్రాయం సైతం డివిజన్ ప్రజల్లో వ్యక్తమవుతోంది.



ప్రతి పనికి 'ఆర్ఆర్' ట్యాక్స్ వసూలు

- చీటింగ్, లూటింగ్ ప్రధాన ఎజెండా
- ఎంపీ బూర నర్సయ్య గౌడ్

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 5: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చీటింగ్, లూటింగ్ ప్రధాన ఎజెండాగా పని చేస్తోందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. ప్రతి పనికి 'ఆర్ఆర్' (రేవంత్ అండ్ రాహుల్) ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. నల్గొండ జిల్లా, చిట్యాలలో గురువారం జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ దోచుకున్న దానికంటే ఎక్కువే కాంగ్రెస్ రాష్ట్రాన్ని దోచేసిందని, అభివృద్ధిని మరిచి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. 6 గ్యారంటీలను 420 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ డబ్బులు పొందడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని, వారి నుండి కూడా కమిషన్లు రావాలని చూస్తున్నారని అన్నారు. హెల్త్ పాలసీ, నైని గోల్డ్ బ్లాక్ ద్వారా ప్రజాధనాన్ని దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారని చెప్పారు. మునిసిపాలిటీల అభివృద్ధికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వేలకోట్ల రూపాయల నిధులను సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం అందిస్తుందని వివరించారు.



సమస్యలను పరిష్కరించుకునేందుకే విద్యుత్ సదస్సులు

- ఎన్ వి వేణుగోపాల చారి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 5: వినియోగదారులు తమ సమస్యల్ని పరిష్కరించుకునేందుకు కన్స్యూమర్ ఫోరం వినియోగించుకోవచ్చని ఫోరం చైర్మన్ ఎన్ వి వేణుగోపాలచారి అభిప్రాయపడ్డారు. గురువారం హసనపర్తి మండలం ఎల్లాపూర్ సబ్ స్టేషన్‌లో జరిగిన విద్యుతు వినియోగదారుల సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. చింతగట్టు టౌన్, చింతగట్టు రూరల్ హసనపర్తి మూడు సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల్ని పరిష్కరించుకునేందుకుగాను అధికారులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యల్ని అధికారులు తాత్సర్యం చేస్తే కన్జ్యూమర్ ఫోరంలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. వివిధ గ్రామాల్లో విద్యుత్ సంబందించిన ఏ సమస్యలున్న తమ దృష్టికి తెస్తే అధికారులను మాట్లాడి ఆ సమస్యల్ని తక్షణమే తక్షణమే సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిర్దిష్టమైన సమస్యలని సత్వరమే పరిష్కరించకపోతే వారికి జరిమానా విధించబడుతుంది అని తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు మరి ఏమైనా సమస్యలు ఉంటే ఎన్ పి డి సి ఎల్ వాట్సాప్ గ్రూప్ లో సంప్రదించవచ్చు అని ఆయన వినియోగదారులను కోరారు. ఇంకా ఈ సదస్సులో కన్జ్యూమర్ ఫోరం నెంబర్ కే రమేష్ దేవేందర్ హనుమకొండ ఎస్ ఇ మధుసూదన రావు డి మల్లికార్జున్ ఏ డి ఈ అశోక్ మరియు ఏ ఈ లు సి హెచ్ శిరీష్ కుమార్ సత్య నారాయణ తరుణ్ రిటైర్డ్ లైన్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్త్ ఇతర సిబ్బందితో పాటు పలుగురు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్స్ కోసం ఏర్పాట్లు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 5: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్ల వార్డు సభ్యుల 2వ సాధారణ ఎన్నికలు - 2026ను సజావుగా నిర్వహించేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల కోసం "పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు" ఏర్పాటు చేయడం జరిగిందని ఇంచార్జ్ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ను ఎంచుకున్న ఎన్నికల విధుల్లో నియమితులైన సిబ్బంది ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేందుకు, కామారెడ్డి జిల్లాలోని క్రింది పట్టణ స్థానిక సంస్థలలో 06,07, 08తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఓటరు సౌకర్యాల కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీ - మున్సిపల్ కార్యాలయం, బాన్సువాడ మున్సిపాలిటీ - మున్సిపల్ కార్యాలయం, బిచ్కుంద మున్సిపాలిటీ - జిల్లా పరిషత్ స్కూల్, కొత్త భవనం, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ - మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది ఈ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇంచార్జి జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

కామారెడ్డిలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ పరిశీలన

మున్సిపల్ ఎన్నికలు - 2026 నిమిత్తం కామారెడ్డిలో జరుగుతున్న బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు, సీల్ విధానం, లెక్కింపు , ప్యాకింగ్ ప్రక్రియలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరగాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎన్నికల విభాగానికి చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట తప్పని పార్టీ భారతీయ జనతా పార్టీ

- 6 గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు చేసింది శూన్యం



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5 : బీజేపీ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఏదైతే హామీ ఇస్తుందో, అది పక్కాగా అమలు చేస్తుందని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే నగరం లోని 9, 10, 11 డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలలో ఒక్కటైనా పూర్తిగా అమలు చేయని చేతగాని ప్రభుత్వమని విమర్శించారు. 6 గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. అలాగే, రూ.2,000 పెన్షన్ దారులకు రూ.4,000 పెన్షన్, రూ.4,000 పెన్షన్ దారులకు రూ.6,000 పెన్షన్ ఇస్తామని చెప్పి చివరకు మొండి చేయి చూపారని విమర్శించారు. చదువుకునే యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పారని, ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఇక, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా బుధవారం ఓ సమావేశంలో తోపులా మాట్లాడారని, ఆయన పదేళ్ల పరిపాలనలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని తీవ్రంగా విమర్శించారు. కనీసం నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కూడా అందించలేని మాజీ ఎమ్మెల్యే, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలను మభ్య పెడుతున్నారని ఘాటుగా మండిపడ్డారు. ఆయన పదేళ్ల పరిపాలనలో అవినీతికి ప్రాధాన్యతనిస్తూ, కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తి పడి, నాణ్యతలేని పనులు చేపట్టి కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును తన అనుచరులతో కలిసి పంచుకోలేదా? అని తీవ్రంగా ప్రశ్నించారు. అత్యంత అవినీతిపరుడైన నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే పదేళ్ల కాలంలో అభివృద్ధి చేయక, ఇప్పుడు ఎన్నికల ముందు వచ్చి తోపులా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమాలలో భారతీయ జనతా పార్టీ 9వ డివిజన్ అభ్యర్థి శ్రీమతి ఇల్లందుల మమత, ప్రభాకర్, 10వ డివిజన్ అభ్యర్థి శ్రీ పుట్ట వీరేందర్, 11వ డివిజన్ అభ్యర్థి గట్ల సుజాత, గంగాధర్, మండల అధ్యక్షులు నాగరాజు, డివిజన్ నాయకులు,కిరణ్, సుందర్ రాథోడ్, సాయినాథ్ పవర్, మారుతీ, శివాజీ, వెంకటేష్,చంద్రకాంత్, డివిజన్ నాయకులు, పవర్ కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గత పాలకులు చేసిన తప్పులను సరిచేయడంపై తాము దృష్టి పెట్టాం. కాంగ్రెస్‌కు ఐడియా, విజన్, ప్లాన్ లేవు. గతంలో ఏదైనా ఒప్పందం గురించి మాట్లాడితే.. ప్రజలు బోఫోర్స్ గురించే ప్రస్తావించే వారు. ఓటు బ్యాంకు రాజకీయాలు కీలక సంస్థలను బలహీనపరిచాయి. ఎన్నో ఏళ్లు దేశం బాధపడాల్సి వచ్చిందని అన్నారు.
- ప్రధాని నరేంద్ర మోడీ

ప్రాంతీయం

తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అధికారమే మార్గం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ప్రతిపక్షం దుబ్బాక, ఫిబ్రవరి 5: గత పదేళ్ల బీఆర్ఎస్ కుటుంబ పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ అవినీతి పాలన వల్ల తెలంగాణ దోపిడీకి గురైందని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆరోపించారు. మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాకలో జరిగిన బీజేపీ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే అది ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధుల వల్లేనని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు 'జై శ్రీరాం', 'బీజేపీ జయ జయ' నినాదాలతో సభా ప్రాంగణాన్ని మారుమోగించారు. సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ... గత పదేళ్లుగా బీఆర్ఎస్ కుటుంబ పాలన, రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ అవినీతి పాలన కారణంగా తెలంగాణ రాష్ట్రం తీవ్రంగా దోపిడీకి గురైందని విమర్శించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు అభివృద్ధి చెందకపోవడానికి మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డే ప్రధాన కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అభివృద్ధి కనిపిస్తే అది జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాల వల్లేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో అవినీతి, కుటుంబ పాలనకు ముగింపు పలకాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఓటర్లను ఆయన కోరారు.అంతకుముందు ఎం పి రఘునందన్ రావు మాట్లాడుతూ దుబ్బాక అభివృద్ధి కోసం తానే మొండిగా పోరాటం చేశానని బిజెపి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల కోసం పనిచేశానని తెలిపారు. రెండేళ్లుగా గ్రామాలకు నిధులు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం దుబ్బాకను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యేలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో బీజేపీ లేకపోతే కాంగ్రెస్‌కు దిక్కులేదని వ్యాఖ్యానించిన రఘునందన్ రావు, "మేం లేకపోతే నీ చెప్పులు కూడా ఎత్తుకెళ్లే పరిస్థితి ఉండదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా గ్రామాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోయిన ప్రభుత్వం ఎన్నికలు ఎందుకు పెట్టిందని ప్రశ్నించారు. దుబ్బాక అభివృద్ధి విషయంలో తానే ముందుండి పోరాటం చేశానని పేర్కొన్న ఆయన, 24 గంటలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉండి ప్రజల సమస్యల కోసం పనిచేశానన్నారు. కూలిపోయే బుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తానే గృహప్రవేశాలు చేయించానని చెప్పారు. తనకు పేరు వస్తుందని నీళ్లు, కరెంట్ కట్ చేశారంటూ ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే 27 నెలల్లో దుబ్బాకకు 27 సార్లు కూడా రాలేదని విమర్శించారు. దుబ్బాకకు మొదటి శత్రువు సిద్దిపేట ఎమ్మెల్యే అని పేర్కొంటూ, మొండిగోడల ఆసుపత్రి, ఐటీఐ, ఆడిటోరియం వంటి పనులు ఎందుకు పూర్తి కాలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దుబ్బాక బస్టాండ్ నిర్మాణం తానే చేయించే వరకు ఎవరికి ఆలోచన రాలేదని, కొత్త ఎమ్మెల్యే కొత్తగా చేసిన పనులు ఏవో చెప్పాలని సవాల్ విసిరారు. రియల్ ఎస్టేట్ తప్ప పాలకులకు మరో అజెండా లేదని, అక్కడ దోచుకుని ఇక్కడ ఎన్నికలకు పంచుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పేరు మీద స్కూల్ కట్టి ప్రారంభించకుండా పిల్లలతో కొబ్బరికాయ కొట్టించారని విమర్శించారు. దుబ్బాక కోసం పోరాడింది రఘునందన్ తప్ప ఇంకెవరూ కాదని అన్నారు. నాలుగు వేల పెన్షన్, తులం బంగారం, ఇందిరమ్మ ఇళ్లు ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. దుబ్బాకలో కాంగ్రెస్‌కు ఎప్పుడూ డిపాజిట్ రాలేదని, కొత్త ప్రభాకర్ ఢిల్లీలో ఏం చేశాడో ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు. దుబ్బాకను తాను ఎన్నడూ మరవనని, దగ్గరుండి అభివృద్ధి చేస్తానని రఘునందన్ రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్, నాయకులు అంబటి బాలేష్ గౌడ్, పల్లె వంశీ కృష్ణ గౌడ్, వేణుగోపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, జనరల్ అబ్జర్వర్ సీహెచ్. సత్యనారాయణ రెడ్డిల సమక్షంలో గురువారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సాయన్న, డీఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ విధులలో నిమగ్నం అయి ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఐ.డీ.ఓ.సీ(కలెక్టరేట్), మున్సిపల్ కార్యాలయాలలో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు సంబంధిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు ఐ.డీ.ఓ.సీ(కలెక్టరేట్)లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. అదేవిధంగా బోధన్ మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు బోధన్ మున్సిపల్ కార్యాలయంలో, ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో, భీంగల్ మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు భీంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ నెల 07,08 తేదీలలో ఆయా కార్యాలయాల పని వేళల్లో పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని, ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఈ నెల 08న పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.



పట్టణాభివృద్ధికి కృషి

ప్రతిపక్షం, బాన్సువాడ, ఫిబ్రవరి 5: బాన్సువాడ పట్టణభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని, పట్టణభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు, ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలోని 01 వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాసోజి లావణ్య నరసింహచారికి, 07 వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి. సరిత నర్సుగౌండకి మద్దతుగా జరిగిన వారి వారి వార్డులలో జరిగిన అభివృద్ధి పనులను, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల ప్రచారంలో బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా

- 4వ డివిజన్ అభ్యర్థి ఇస్తారీ శంకర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5: కార్పొరేటర్ గా తాను గెలిచాక డివిజన్ ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని 4వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఇస్తారీ శంకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నాలుగవ డివిజన్ బ్యాంక్ కాలనీలలో పార్టీ నాయకులు, మద్దతుదారులతో కలిసి ప్రచారం నిర్వహించారు. డివిజన్లో ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో వాటిని తక్షణమే పరిష్కరించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, ఎంతోమంది నాయకులు ప్రజలతో ఓట్లు వేయించుకొని గెలిచాక ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. తాను గెలిచాక డివిజన్లో సమస్యలను తీర్చేందుకు ముందుంటానన్నారు. కాలనీలో ఏమైన సమస్యలు తలెత్తితే ఒకే రోజు లో పరిష్కరిస్తానని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు సేవ చేస్తానని ప్రచారంలో ముందుకెళ్తున్నారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆశీస్సులతో ప్రచారంలో దూసుకెళ్తున్నాడు. అనేక సంవత్సరాలుగా డివిజన్లో ఉంటున్న తనకు కాలనీలో సమస్యలు తెలుసని, సమస్యలు తెలిసిన వాడికే ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరుతున్నారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపులో బీజేవైఎం కీలక పాత్ర పోషించాలి

- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 5 : బీజేపీ అభ్యర్థుల గెలుపులో బీజేవైఎం కీలక పాత్ర పోషించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ పిలుపునిచ్చారు. గురువారం భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన "ZZEN సమ్మేళనం" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ మాట్లాడుతూ రాబోయే ఇందూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బీజేవైఎం కార్యకర్తలు, యువత క్షేత్రస్థాయిలో ఎలా పని చేయాలన్న అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌ను బలపరచడం, యువతను ఓటింగ్ ప్రక్రియకు ప్రోత్సహించడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు, ₹4,000 నిరుద్యోగ భృతి, మహిళా యువతకు స్కూటీ, జాబ్ నోటిఫికేషన్లు వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేకపోయిందని మండిపడ్డారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, నేడు యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని యువత తగిన సమయంలో తగిన గుణపాఠం చెబుతుందని స్పష్టం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ ఇందూరులో బీజేపీ బలోపేతానికి యువ మోర్చా శక్తి ప్రధాన ఆయుధం అని పేర్కొన్నారు. యువత ఉత్సాహం, క్రమశిక్షణతో ముందుకు సాగితే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో యువ మోర్చ నాయకుల కు తగిన ప్రాధాన్యత ఇచ్చామన్నారు. భవిష్యత్తు ప్రతి గెలుపులో ముందుండి నడిపించాల్సిన బాధ్యత యువమోర్చదే అని దినేష్ పటేల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అమంద్ విజయ్ కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఐటీ సెల్ జిల్లా అధ్యక్షులు నరేష్ గౌడ్, విపుల్ రావు,వినోద్ రెడ్డి, మండల అధ్యక్షులు జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.



17వ వార్డులో బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 5: దుబ్బాక మున్సిపాలిటీ 20 వార్డుల్లో బీజేపీ అభ్యర్థుల విజయం సాధించేందుకు పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు నేతృత్వంలో బీజేపీ శ్రేణు ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించాయి. ఈ క్రమంలో 17వ వార్డులో బీజేపీ అభ్యర్థి పెంటం కిషన్ కు మద్దతుగా, ఒక సామాన్య బీసీ మహిళ దుబ్బాక చైర్పర్సన్ లక్ష్యంగా, జిల్లా అధ్యక్షులు బైరీ శంకర్ ముదిరాజ్, 17 వార్డు ఇంచార్జి కొత్తపల్లి వేణుగోపాల్, పల్లె వంశీ కృష్ణ గౌడ్ లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా బీజేపీ అభ్యర్థి కిషన్‌కు ఉత్సాహభరిత స్వాగతం పలికారు. పేదరిక నివాస ప్రాంతాల్లో నాణ్యత లేని డబల్ బెడ్‌రూములు నిర్మించడం, గుడులను వ్యాపార కేంద్రాలుగా మార్చడం వంటి సమస్యలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాటుకు వేసే ఓటు ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి వారు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రచారం ద్వారా స్థానిక నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు దబ్బాకలో బీజేపీ అభ్యర్థుల విజయం సాధించేందుకు నిరంతర ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

సిద్దిపేటలో శాంతిభద్రతలపై పోలీస్ కమిషనర్ సమీక్ష



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 5: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేయాలని, ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, మహిళలపై జరుగుతున్న వేధింపుల కేసుల్లో విచారణను మరింత త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రాత్రి సమయాల్లో దొంగతనాలు జరగకుండా బ్లూ కోల్ట్స్‌తో పాటు పెట్రోలింగ్ వాహనాల గస్తీని పెంచాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొన్న కమిషనర్, ప్రతి గ్రామం మరియు పట్టణ ప్రాంతాల్లో 'నేను సైతం' కార్యక్రమం ద్వారా మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, వారి సమస్యలను శ్రద్ధగా విని తక్షణమే స్పందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, న్యూసెన్స్ సృష్టించడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ పెట్టీ కేసుల్లో జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని వాహనాలను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ విభాగాల ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ విద్యార్థులకు అక్షయపాత్ర భోజనంపై రగడ

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 5: చేగుంట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు అక్షయపాత్ర భోజనాన్ని అందించారు. మధ్యాహ్న భోజనం వంటకాలు సక్రమంగా లేవని దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రిన్సిపాల్ చంద్రకళ జిల్లా అధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్షయపాత్ర భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు.మధ్యాహ్న భోజన పథకాన్ని కొన్ని సంవత్సరాలుగా అమలు చేస్తున్న వారిని పక్కకు నెట్టడం బాధాకరమని సీఐటీయూ నాయకురాలు బాలమణి ఎద్దేవా చేశారు. దీంతో వంట కార్మికుల కు బాలమని మద్దతు పలుకుతూ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ తో వాగ్వివాదానికి దిగి రగడ సృష్టించారు. సకాలంలో వేతనాలు అందకపోయినా సొంత డబ్బులు ఖర్చు చేసి వంట కార్మికులు వంటలు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని బాలమణి ఆరోపించారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించడం లేదని దీంతో విద్యార్థుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ చంద్రకళ సిఐటియు నాయకురాలు బాలమణి కి వివరించారు . సంవత్సరాల తరబడి మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్న వంట కార్మికులను పక్కకు నెట్టడం సరికాదని పొరపాట్లు ఉంటే సరి చేయవచ్చని బాలమణి ప్రిన్సిపాల్ చంద్రకళ కు వివరించారు. మధ్యాహ్న భోజనాన్ని వంట కార్మికులు వంటలు చేసి పంపిణీ చేయాలని లేనియెడల ఆందోళన చేపడతామని బాలమని డిమాండ్ చేశారు.



మరో ఎనిమిదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది. రెండేళ్లలో తామేం చేశామో చెబితే బీఆర్ఎస్‌నేతల గుండెలు పగులుతాయి. 70 వేల ఉద్యోగాలిచ్చాం, 25లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించాం, 25 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ చేశాం. బండి సంజయ్ మాపై రంకెలేయడం కాదని, కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేసి కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలి.
- చొప్పదండి సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 5: రెవెన్యూ రికార్డుల నిర్వహణతో పాటు ప్రభుత్వ భూముల సంరక్షణను సక్రమంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. తహసీల్దార్ స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ లాగిన్ వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారితనం ఎంతో ముఖ్యమని, భూభారతి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఆర్ఓఆర్, 1బి వంటి రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్, డీఆర్ఓ నాగరాజమ్మ, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం

- కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 5: పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యపడనుండగా, ప్రతి పేద గౌరవంగా బ్రతకాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో 20వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వంటేరు కొండల్ రెడ్డికి మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే పేద ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రూ 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు రూ 500 బోనస్, ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలను కొనసాగిస్తూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సహకారంతో 20 వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే అవసరమైన నిధులు సాధించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, పేదల ఆర్థికాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందించే కొండల్ రెడ్డికి ఓట్లు వేయాలని అభ్యర్థించారు.



వివోఏలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ వివోఏల మద్దతు

ప్రతిపక్షం, మిరుదొడ్డి, ఫిబ్రవరి 5: 29 కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు అమల్లోకి తెస్తూ 2025 నవంబర్ 21న ఇచ్చిన నోటీసును రద్దు చేయాలని వివో ఏల జిల్లా కార్యదర్శి యమునా, మహేష్ అన్నారు. గురువారం మిరుదొడ్డి మండల సమైక్య కార్యాలయంలో ఈనెల 12 నిర్వహించే సమ్మెకు సమ్మె నోటీసును ఏపీఎం లక్ష్మీ నరసమ్మకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిలు ఉన్న శ్రీనిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు ఇవ్వాలని అన్నారు గ్రామ సంఘం నుండి 3000 రూపాయలు వేతనాన్ని ఇచ్చి ప్రతి గ్రామ సంఘానికి ట్యాబు నెట్వర్క్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ప్రకారం వివోఏలకు ప్రతినెల 20వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు వారికి 20 లక్షల సాధారణ భీమా ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించాలని అన్నారు గ్రామ సంఘాల గ్రేడింగ్ తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వివోఏ వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలని వారు కోరారు సామాజిక భద్రత కల్పిస్తూ ప్రమాద బీమా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు స్కీం కార్మికులతో సహా కార్మికులందరికీ జాతీయస్థాయిలో కనీస వేతనం అందించాలని వారు కోరారు. గ్రామ సంఘం కు సంబంధించిన పనులు కాకుండా అదనంగా గ్రామంలో పనులు చెబుతూ వారితో వెట్టిచాకిరి చేయించుకోవడం సరికాదని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివోఏలు స్వప్న, వెంకటలక్ష్మి, భూపాల్, జమున, రవళి మానస, బుజ్జమ్మ, ప్రియాంక, భాగ్య, మైపాల్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.



అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని 5,7,8,9,10 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు మామిళ్ల ఆంజనేయులు, మాయ అనురాధ శ్రీనివాస్, మాయ గంగామణి మల్లేశం, జుబేర్ అహ్మద్, వనం లత వెంకటేష్ కు మద్దతుగా ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే రెండేళ్లు గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, అందువల్ల కాంగ్రెస్కు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదన్నారు. ఆరు గ్యారెంటీల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మా అక్క చెల్లెళ్లకు రూ.2,500 జీవన భృతి, పెన్షన్ల పెంపు జరగలేదన్నారు.పంటల సాగుకు కేసీఆర్ హయంలో నిరంతరంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేసామని,ప్రస్తుతం 12 గంటలు కూడా సక్రమంగా రావడం లేదని వివరించారు.కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. నేను 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా..కానీ రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎప్పుడు రాలేద ని పేర్కొన్నారు. మెదక్ మున్సిపల్ లో బి ఆర్ ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు, పట్టణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజాగౌడ్ మాజీ ఎంపీపీ కిష్టయ్య, వార్డ్ ఇన్చార్జిలు గట్టయ్య,షాకీర్, ప్రభాకర్,ఎంబిపూర్ మహేష్, రంగారావు,రాజ్ కుమార్, స్వామి, లాలు నాయక్, అంటోని, వినయ్, నాయకులు లింగా రెడ్డి, జైపాల్ రెడ్డి, సోములు, ఫాజిల్, కండెల నర్సింలు, గోపాల కృష్ణ, హరి, ఓమర్ ఫారుక్, స్వామి నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసాను మున్సిపల్ ఎన్నికల తరువాత ఇస్తామని సీఎం రేవంత్ చెప్పడం సరికాదు. కేసీఆర్ డిసెంబర్లోనే ఇచ్చేవారు. డిసెంబర్లో వేయాల్సిన డబ్బులు నేటికీ ఇవ్వకుండా ఇప్పుడు ఎన్నికలయ్యాక ఇస్తామనడం ఏమిటి? మున్సిపల్ ఎన్నికలే కదా? రైతులకు ఇచ్చేదానికి ఎవరు అడ్డం పడ్డారు? ఇప్పుడే ఇవ్వాలి. ఎన్నికలయ్యాక అంటే ఏరు దాటాక బోడిమల్లన్న అంటారు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తెలంగాణ జాతిపితే

- గజ్వేల్ గౌరవం కోసం కారు గుర్తును గెలిపించాలి
- రెండేళ్లలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే
- మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 5: త్యాగాలతో, ఆమరణ దీక్షతో కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ముమ్మాటికి తెలంగాణ జాతిపిత అని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పలు వార్డుల్లో గురువారం నాడు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చినప్పుడు మనకు అన్నం పెట్టినవాళ్లకు, మన కోసం పని చేసినవాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్నవాళ్లకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. “సద్ది తిన్న రేవు తలవాలి” అన్న సామెతను గుర్తు చేస్తూ, గజ్వేల్ అభివృద్ధి ప్రధాత కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ రాకముందు గజ్వేల్ పరిస్థితి ఏ విధంగా ఉండేదో, ప్రస్తుతం ఎలా మారిందో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. ఒకప్పుడు ప్రజ్ఞాపూర్-గజ్వేల్ రోడ్డు దయనీయ స్థితిలో ఉండేదని, గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా మారిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. అలాంటి ఆసుపత్రిని నేడు 250 పడకల ఆధునిక ఆసుపత్రిగా మార్చి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. గజ్వేల్‌కు ఆర్డీవో కార్యాలయం, రైల్వే సదుపాయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ వంటి అనేక అభివృద్ధి పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని హరీష్ రావు తెలిపారు. అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల పెళ్లికి లక్ష 116 ఆర్థిక సహాయం అందించి మేనమామలా ఆదుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన మహిళలకు కేసీఆర్ కిట్‌తో పాటు 13 వేల ఆర్థిక సహాయం అందించిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థుల కోసం గురుకులాలు ఏర్పాటు చేసి చదువుల విప్లవానికి నాంది పలికారని తెలిపారు. ఒకప్పుడు మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి ఉండగా, నేడు ప్రతి ఇంటికీ నల్లా ద్వారా మంచినీరు అందేలా చేసి మహిళల కష్టాలను తీర్చిందీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిలవాలంటే, తెలంగాణను కాపాడుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలని హరీష్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పుడెన్నికయ్యే కౌన్సిలర్లు ఐదేళ్లు ఉంటారని, రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజ్ఞాపూర్ గౌరవం నిలవాలంటే, గజ్వేల్ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ గెలవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో పట్టణ ప్రముఖులు గుంటుకు మల్లేశం, సయ్యద్ ఇక్బాల్ మరియు స్థానిక మార్వాడి సంఘం నాయకులు హరీష్ రావు సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వెంటేరు ప్రతాప్ రెడ్డి, ఎన్నికల ఇన్చార్జ్ రాధాకృష్ణ శర్మ, ఎం సి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ , నాయకులు పాల్గొన్నారు.



వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

- పట్టు వస్త్రాలు సర్మర్పించిన సర్పంచ్ రాజిరెడ్డి దంపతులు

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 5: చేగుంట మండలం బి, కొండాపూర్ గ్రామంలోని సింగరాయ గుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రంగయ్యగారి రాజిరెడ్డి ఆయన సతీమణి ప్రవీణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామం నుండి భాజా భజంత్రీలతో ఊరేగింపుగా సింగరాయ గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అత్యంత వైభవంగా వారం రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రముఖులు పాల్గొన్నారు. చేగుంట రామాయంపేట నార్సింగి దౌల్తాబాద్ మిరుదొడ్డి భూమిపల్లి మండలాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 8వ తేదీ బండ్ల బోనాల ఊరేగింపుతో కార్యక్రమాల ముగింపు ఉంటుందని సర్పంచ్ రాజిరెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న

240 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 5: మెదక్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న మద్యంను పట్టుకొని స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేసినట్లు మెదక్ టౌన్ సీఐ మహేష్ తెలిపారు.పట్టణంలోని నర్సాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆఫీసర్స్ ఛాయిస్ 144 క్వార్టర్ బాటిళ్ళు, ఇంపీరియల్ బ్లూ 96 క్వార్టర్ బాటిళ్ళు మొత్తం 240 బాటిళ్ళు కలిపి 43 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేష్ పేర్కొన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 5: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యుడు బట్టు దయానంద రెడ్డి తమ కార్యకర్తలతో కలిసి 7,9,10,13 వార్డులలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేస్తూ 'కంకి కొడవలి' గుర్తుకు ఓటేసి తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం లోమాట్లాడుతూ మల్లన్న సాగర్ లో అనేక సమస్యల పైన పోరాడిన పార్టీ సీపీఐ అని, 2013 చట్టం ప్రకారం భూనిర్వాసులకు నష్టపరిహారం ఇవ్వాలని అనేకసార్లు ధర్నాలు రాస్తారోకోలు నిర్వాసితులతో కలిసి పోరాటం చేయడం ఆ పోరాటంలో అనేకసార్లు పోలీసులతో లాఠీ దెబ్బలు తిని కొన్నిసార్లు జైలుకు కూడా వెళ్లడం జరిగిందన్నారు. కాబట్టి భూనిర్వాసుల సమస్యలుతీరాలంటే సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాఅభ్యర్థులను గెలిపిస్తే ఇంకా పెండింగ్లో ఉన్న ఒంటరి మహిళలకు ప్యాకేజీలు గాని 18 ఇయర్స్ ప్యాకేజీలు గాని ఇండ్లు రిజిస్ట్రేషన్ గానీ ఇంకా ఇండ్లు రాని వారికి ఇండ్లు గాని బై నెంబరు గాని వీటి అన్నిటి పైన ప్రజల పక్షాన నిలబడిప్రభుత్వంతో పోరాడుతామన్నారు. బిజెపి ప్రజలకు భూనిర్వాసులకు చేసింది ఏమీ లేదని బిజెపికి ఓటు వేస్తే అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం,శివ లింగ కృష్ణ, పార్టీ నాయకులు మొట్ట శీను, కొండ కింది పోచయ్య, గూడూరు యాదమ్మ, పోతుల శంకరయ్య పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 5 : మెదక్ పట్టణం అభివృద్ధి చెందాలంటే మెదక్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని, ప్రభుత్వం కాంగ్రెస్ పట్టణంలో కూడా కాంగ్రెస్ జెండా ఎగురుతే అభివృద్ధి వేగంగా సాగుతుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 6, 7, 8 వార్డులలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీ పథకాలే కాంగ్రెస్ పార్టీ ఇది గెలిపిస్తాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వం ఉన్నది కావున మెదక్ లో సైతం కాంగ్రెస్ జెండా ఎగరాలని, మెదక్ పట్టణ అభివృద్ధిని వేగంగా చేసుకోవచ్చని మైనంపల్లి హనుమంతరావు అన్నారు. వార్డులలో ఇంటింటికి తిరుగుతూ వార్డ్ కాంగ్రెస్ పార్టీకి చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని అయినా ప్రజలకు సూచించారు వార్డ్ అభ్యర్థులు ప్రజాసేవకు చేసేందుకు ముందుకు వచ్చారని ఎల్లప్పుడూ వార్డులలో తిరుగుతూ ప్రజా సేవకై పని చేస్తారని ఆయన తెలిపారు. గత పది సంవత్సరాల పాలనలో మెదక్ పట్టణ అభివృద్ధిని మర్చిపోయారని గత పాలనలో పేపర్లకు మాత్రమే నిధులు మంజూరయ్యాయని ఆ నిధులు అప్పటి రాజకీయ నేతల జేబులో ఉన్నాయని ఆయన తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో మెదక్ అభివృద్ధి చెందుతుందని మెదక్ పట్టణ అభివృద్ధికి సుమారు 200 కోట్ల రూపాయలతో ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని ఆయన అన్నారు ఇప్పటికైనా పట్టణ ప్రజలు గ్రహించి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సూచించారు కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీని పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన తెలిపారు ఈ ఈ ప్రచార కార్యక్రమంలో అభ్యర్థులతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ పట్టణ అధ్యక్షులు గంగాధర్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గోపాల్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు పవన్ తదితరులు ఉన్నారు.

న్యాయవాది హత్యపై బార్ అసోసియేషన్ నిరసన

- స్వప్న హత్యను ఖండిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో సిద్దిపేట కోర్టులో ఆందోళన



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 5: చేవెళ్ళ కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న మొయినాబాద్ కు చెందిన స్వప్న అనే యువ న్యాయవాదిని హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి హెచ్ జనార్దన్ రెడ్డి తెలిపారు. న్యాయవాదులకు రక్షణగా వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలని సిద్దిపేట బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రమేష్ డిమాండ్ చేశారు. చేవెళ్ల కోర్ట్ లో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న స్వప్న హత్యను నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కోర్టులో సిద్దిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తెచ్చేవరకు త్వరలోనే సిద్దిపేట నుంచే కార్యాచరణ రూపొందిస్తామని రమేష్ తెలిపారు. తరచూ ఏదో ఒకచోట న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మనపల్లి శ్రీనివాస్, పెద్ద లింగన్నగారి ప్రసాద్, దయానంద్, మనోహర్ , న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వప్న హంతకులను శిక్షించాలి

న్యాయవాద పరిషత్ డిమాండ్

మొయినాబాద్‌కు చెందిన మహిళ న్యాయవాది స్వప్న హత్య ఘటనను సిద్దిపేట జిల్లా న్యాయవాద పరిషత్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని, న్యాయవాదుల భద్రత కోసం న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు రామవరం భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్, కోశాధికారి బి. రవి ప్రసాద్, ప్రొద్దుటూరి శ్రీకాంత్, శేషు కుమార్ పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నరవణె పుస్తక వివాదం.. రాజ్యసభలో మాటల యుద్ధం

- మాట్లాడనివ్వడం లేదు: ఖర్గే
- చర్చకు సిద్ధంగా ఉన్నాం: నడ్డా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రిటైర్డ్ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'పై గురువారం రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. పార్లమెంటులో అంతర్గత భాగాలుగా లోక్‌సభ, రాజ్యసభ ఉన్నప్పటికీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీని కొన్ని అంశాలపై మాట్లాడనివ్వక పోవడం దారుణం అని రాజ్యసభ విపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశ ప్రయోజనాలతో ముడిపడిన అంశంపై మాట్లాడే అవకాశాన్ని రాహుల్‌కు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈవిధంగా లోక్‌సభను నడపడం సరికాదని ఖర్గే పేర్కొన్నారు. అయితే ఖర్గే వ్యాఖ్యలపై రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్‌సభ వ్యవహారాల గురించి రాజ్యసభలో ప్రస్తావన తేకూడదని సూచించారు. వెంటనే కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరెణ్ రిజిజు కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. లోక్‌సభ వ్యవహారాల గురించి రాజ్యసభలో మాట్లాడే అవకాశాన్ని ఇచ్చేది లేదన్నారు. ఖర్గే బదులిస్తూ, రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశాన్ని ఇవ్వనందు వల్లే గత నాలుగు రోజులుగా లోక్‌సభ కార్యకలాపాలకు విఘాతం కలుగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడటం మొదలు పెడితే, బీజేపీ ప్రభుత్వానికి దురద పుడుతుందని ఎద్దేవా చేశారు. ఖర్గే వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో కౌంటర్ ఇచ్చారు. లోక్‌సభ వ్యవహారాలను రాజ్యసభలో చర్చించకూడదు అనే దానిపై గత రాజ్యసభ ఛైర్మన్ స్పష్టమైన రూలింగ్స్ ఇచ్చారని గుర్తుచేశారు. అన్ని అంశాలపై పార్లమెంటులో చర్చించేందుకు మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం రెడీగా ఉందని నడ్డా తెలిపారు. లోక్‌సభ సజావుగా సాగే అవకాశాన్నే విపక్షాలు ఇవ్వడం లేదన్నారు. ఒక అమాయక బాలుడి చేతిలో కాంగ్రెస్ పార్టీని బందీగా చేయొద్దని ఖర్గేకు నడ్డా సూచించారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేశారు. ఈనేపథ్యంలో మోదీ సర్కారు వైఖరికి నిరసనగా విపక్షాలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి.



విశ్వ వీక్షణం



ఓలా, ఉబర్, ర్యాపిడోకు ప్రత్యామ్నాయం 'భారత్ ట్యాక్సీ'

- ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూర్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్రం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిల్లీలో దీన్ని అధికారికంగా ప్రారంభించారు. రెండు నెలల పైలట్ రన్ పూర్తి చేసుకున్న అనంతరం ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం దిల్లీఎన్‌సీఆర్, గుజరాత్‌లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించనున్నారు. ప్రైవేట్ సంస్థల్లా రైడ్ సంపాదనలో కమీషన్ తీసుకోకుండా, డ్రైవర్లు రోజుకు కేవలం 30 రూపాయలు ప్లాట్‌ఫామ్ ఫీజుగా చెల్లిస్తే సరిపోతుంది. డ్రైవర్లకు 5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, 5 లక్షల కుటుంబ ఆరోగ్య బీమా కల్పిస్తారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో ధరలు పెంచే విధానం ఇందులో ఉండదు. సాధారణ క్యాబ్ సేవలతో పోలిస్తే ప్రయాణికులకు 20 నుంచి 30 శాతం తక్కువ ధరకే సేవలు అందుతాయి. ఇందులో కార్లు, ఆటో రిక్షాలు, బైక్ టాక్సీలను బుక్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది.



ప్రతి ఒక్కరి లివర్‌లో కొంత మొత్తంలో కొవ్వు ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ లివర్‌లో అధిక కొవ్వు చేరితే అది సమస్యగా మారుతుంది. ప్రస్తుతం దాదాపు 40 శాతం మంది భారతీయులు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారు. దీనివల్ల లివర్ సిర్రోసిస్ వంటి ప్రాణాంతక వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

ఫ్యాటీ లివర్ నిర్లక్ష్యం చేయొద్దు

ప్రతి ఒక్కరి లివర్‌లో కొంత మొత్తంలో కొవ్వు ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ లివర్‌లో అధిక కొవ్వు చేరితే అది సమస్యగా మారుతుంది. ప్రస్తుతం దాదాపు 40 శాతం మంది భారతీయులు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారు. దీనివల్ల లివర్ సిర్రోసిస్ వంటి ప్రాణాంతక వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఫ్యాటీ లివర్ డిసీజ్ అనేది కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం వల్ల వచ్చే ఒక సాధారణ పరిస్థితి. ఇది రెండు రకాలు: ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (AFLD) మరియు నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (NAFLD). ఫ్యాటీ లివర్ తరచుగా ప్రారంభ దశల్లో ఎటువంటి లక్షణాలను చూపించకపోవచ్చు. అయితే, కొన్ని సాధారణ లక్షణాలు ఉంటే ఇవి కనిపించవచ్చు:

అలసట మరియు బలహీనత: ఎప్పుడూ అలసిన భావన, శక్తి తక్కువగా ఉండటం.

కడుపు నొప్పి: కుడి ఎగువ పొత్తికడుపులో స్వల్ప నొప్పి లేదా అసౌకర్యం.

బరువు పెరగడం: ఊబకాయం లేదా అనవసర బరువు పెరుగుట.

జాండిస్: చర్మం లేదా కళ్ళు పసుపు రంగులోకి మారడం (అరుదైన సందర్భాల్లో).

వాపు: కాళ్ళు లేదా కడుపులో వాపు (తీవ్రమైన దశల్లో). తీవ్రమైన సందర్భాల్లో (సిర్రోసిస్ లేదా లివర్ ఫైబ్రోసిస్ వంటివి) లక్షణాలు మరింత స్పష్టంగా ఉండవచ్చు.



ఎదురయ్యే సమస్యలు

ఫ్యాటీ లివర్ నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు:

నాన్-ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ (NASH): కాలేయంలో వాపు మరియు నష్టం.

లివర్ ఫైబ్రోసిస్: కాలేయ కణజాలంలో గాయాలు ఏర్పడటం.

సిర్రోసిస్: కాలేయం శాశ్వతంగా దెబ్బతినడం, దీనివల్ల కాలేయ వైఫల్యం రావచ్చు.

లివర్ క్యాన్సర్: తీవ్రమైన సందర్భాల్లో కాలేయ క్యాన్సర్ ప్రమాదం.

గుండె సంబంధిత సమస్యలు: ఫ్యాటీ లివర్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది.

టైప్-2 డయాబెటిస్: ఫ్యాటీ లివర్ మరియు డయాబెటిస్ మధ్య సంబంధం ఉంది.

నివారణ మరియు చికిత్స

ఫ్యాటీ లివర్‌ను నిర్వహించడానికి జీవనశైలి మార్పులు కీలకం. ఇక్కడ కొన్ని సిఫార్సులు ఉన్నాయి:

వైద్య పర్యవేక్షణ:
డయాబెటిస్, కొలెస్ట్రాల్ లేదా రక్తపోటును నియంత్రణలో ఉంచండి.
క్రమం తప్పకుండా లివర్ ఫంక్షన్ టెస్టులు (LFT) చేయించుకోండి.
వైద్యుడు సూచించిన మందులు లేదా సప్లిమెంట్లు (విటమిన్ E, కొన్ని సందర్భాల్లో) తీసుకోండి.

ఒత్తిడి నిర్వహణ:
ఒత్తిడి హార్మోన్లు కొవ్వు పేరుకుపోవడాన్ని పెంచుతాయి. ధ్యానం, యోగా లేదా రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించండి.
సలహా

వైద్య సంప్రదింపు: ఫ్యాటీ లివర్ లక్షణాలు కనిపిస్తే, వెంటనే గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ లేదా హెపటాలజిస్ట్‌ను సంప్రదించండి.

రెగ్యులర్ చెకప్‌లు: అల్ట్రాసౌండ్, CT స్కాన్ లేదా MRI ద్వారా కాలేయ స్థితిని అంచనా వేయవచ్చు.

జీవనశైలి మార్పులు: చిన్న మార్పులు కూడా దీర్ఘకాలంలో కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

ఫ్యాటీ లివర్‌ను సరైన జాగ్రత్తలతో నియంత్రించవచ్చు మరియు కొన్ని సందర్భాల్లో పూర్తిగా తిరిగి సాధారణ స్థితికి తీసుకురావచ్చు. ఏవైనా నిర్దిష్ట లక్షణాలు ఉంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది.





ఫ్యాటీ లివర్‌ను తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధించే మరియు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహార ఎంపికలు

తీసుకోవాల్సిన ఆహారాలు

కూరగాయలు:
ఆకుకూరలు (పాలకూర, కాలే, బ్రోకలీ): వీటిలో యాంటీఆక్సిడెంట్స్ మరియు ఫైబర్ ఎక్కువగా ఉంటాయి, ఇవి కాలేయంలో వాపును తగ్గిస్తాయి.

క్యారెట్, బీట్‌రూట్, గుమ్మడికాయ: బీటాకెరోటిన్ మరియు యాంటీఆక్సిడెంట్స్ కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

క్రూసిఫెరస్ కూరగాయలు (క్యాబేజీ, కాలీఫ్లవర్): డిటాక్సిఫికేషన్‌కు సహాయపడతాయి.

పండ్లు:

బెర్రీలు (బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీస్): యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి, ఇవి కాలేయ కణాలను రక్షిస్తాయి.

ఆపిల్, అవకాడో: ఫైబర్ మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు అందిస్తాయి.

సిట్రస్ పండ్లు (నిమ్మ, ఆరెంజ్): విటమిన్ C మరియు యాంటీఆక్సిడెంట్స్ కాలేయ డిటాక్స్‌కు సహాయపడతాయి.

తృణధాన్యాలు:
ఓట్స్, బ్రౌన్ రైస్, క్వినోవా: ఫైబర్ ఎక్కువగా ఉండే తృణధాన్యాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి మరియు బరువును నియంత్రిస్తాయి.

లీన్ ప్రోటీన్లు:

చేపలు (సాల్మన్, మాకెరెల్): ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కాలేయంలో కొవ్వును తగ్గిస్తాయి.

చికెన్ (స్కిన్ లేనిది), టోఫు, లెగ్యూమ్స్ **(పప్పులు, చిక్‌పీస్):** శరీరానికి అవసరమైన ప్రోటీన్ అందిస్తాయి, కొవ్వు తక్కువగా ఉంటుంది.

ఆరోగ్యకరమైన కొవ్వులు:

ఆలివ్ ఆయిల్, అవకాడో, గింజలు (బాదం, వాల్‌నట్స్): ఇవి మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులను అందిస్తాయి, ఇవి కాలేయానికి హాని చేయవు.

మసాలాలు, హెర్బ్స్:

పసుపు: కర్కుమిన్ యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉంటుంది.

వెల్లుల్లి: కాలేయ డిటాక్సిఫికేషన్‌ను ప్రోత్సహిస్తుంది.

జీలకర్ర, ధనియాలు: జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

పానీయాలు:

గ్రీన్ టీ: యాంటీఆక్సిడెంట్స్ (కాటెచిన్స్) కాలేయంలో కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి.

నీరు: శరీరంలో టాక్సిన్స్ తొలగించడానికి రోజుకు 810 గ్లాసుల నీరు తాగండి.

కాఫీ: అధ్యయనాల ప్రకారం, కాఫీ కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది (చక్కెర లేకుండా తాగాలి).

తీసుకోకూడని ఆహారాలు

ఫ్యాటీ లివర్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలను నివారించడం మంచిది:

చక్కెర ఆహారాలు: సాఫ్ట్ డ్రింక్స్, స్వీట్స్, ఐస్ క్రీమ్, బేకరీ ఉత్పత్తులు.

ప్రాసెస్డ్ ఫుడ్స్: ఫాస్ట్ ఫుడ్, చిప్స్, ఫ్రైడ్ ఫుడ్స్.

ట్రాన్స్ ఫ్యాట్స్: మార్గరిన్, ప్యాకేజ్డ్ స్నాక్స్‌లో ఉండే కొవ్వులు.

మద్యం: ఆల్కహాల్ పూర్తిగా మానేయండి, ఎందుకంటే ఇది కాలేయ నష్టాన్ని వేగవంతం చేస్తుంది.

అధిక కార్బోహైడ్రేట్ ఆహారాలు: వైట్ రైస్, వైట్ బ్రెడ్, పాస్తా.

నమూనా ఆహార ప్రణాళిక

ఉదయం: ఓట్స్ (పండ్లు మరియు గింజలతో), గ్రీన్ టీ.

మధ్యాహ్నం: బ్రౌన్ రైస్, గ్రిల్డ్ చికెన్/చేప, ఆవిరిలో ఉడికించిన కూరగాయలు, ఒక గిన్నె సలాడ్.

సాయంత్రం స్నాక్: ఒక ఆపిల్ లేదా ఒక ముక్క అవకాడో, బాదం (1012).

రాత్రి: రొట్టెలు (జొన్న లేదా రాగి), పప్పు కూర, ఆకుకూరల సూప్.

వైద్య సంప్రదింపు:

ఆహార ప్రణాళికను రూపొందించే ముందు డాక్టర్ లేదా న్యూట్రిషనిస్ట్‌ను సంప్రదించండి, ముఖ్యంగా మీకు డయాబెటిస్ లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే.

వ్యాయామం:


ఆహారంతో పాటు, రోజుకు 3045 నిమిషాల వ్యాయామం (వాకింగ్, యోగా) ఫ్యాటీ లివర్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.

ఈ ఆహార నియమాలను క్రమం తప్పకుండా పాటిస్తే, కాలేయంలో కొవ్వు తగ్గడమే కాకుండా మొత్తం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.



కోల్ మైనింగ్‌లో పేలుడు: 18 మంది మృతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, షిల్లాంగ్, ఫిబ్రవరి 5: మేఘాలయలో కోల్ మైనింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 18 మంది మరణించి ఉండొచ్చని తెలుస్తోంది. మేఘాలయ, ఈస్ట్ జైంటియా జిల్లాలో గురువారం ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. స్థానిక తంగ్స్కు ఏరియాలో బొగ్గు కోసం కొందరు ర్యాట్ హోల్ పద్ధతిలో మైనింగ్ చేస్తున్నారు. ఇది అక్రమం. దీనివల్ల పర్యావరణానికి హాని కలగడంతోపాటు ఈ పద్ధతిలో కార్మికులకు ప్రమాదకరం. అందుకే ఈ విధానాన్ని ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. అయినప్పటికీ కొందరు ఆదాయం కోసం ఈ పద్ధతిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. గురువారం మైనింగ్‌లో భాగంగా బ్లాస్టింగ్ చేస్తుండగా గని కూలినట్లు తెలుస్తోంది. దీంతో లోపల ఉన్న కార్మికుల్లో 18 మంది మరణించారని సమాచారం. ఒకరు తీవ్రంగా గాయపడగా అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం షిల్లాంగ్ తరలించారు. ఈ ఘటన సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) టీం ఘటనాస్థలానికి చేరుకుంది. గని లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, గని లోపల ఎంతమంది చిక్కుకున్నారో ఇప్పుడే చెప్పలేమని జిల్లా ఎస్పీ వికాస్ కుమార్ అన్నారు. ఈ గని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, బొగ్గు సేకరణలో భాగంగా నిర్వహించిన పేలుడే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.





బీజాపూర్‌లో మరో ఎన్‌కౌంటర్

- మావోయిస్టు కీలక నేత ఉదమ్ సింగ్ హతం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బీజాపూర్, ఫిబ్రవరి 5: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య కాల్పులు జరిగాయి. ఆ ఘటనలో మావోయిస్టు కీలక నేత ఉదమ్ సింగ్ మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి మృతదేహంతో పాటు ఏకే47 రైఫిల్‌ను స్వాధీం చేసుకున్నట్లు భద్రతా దళాలు తెలిపాయి. ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టుల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నాయి. జిల్లాలోని దక్షిణ అటవీ ప్రాంతంలో సాయుధ మావోయిస్టుల ఉన్నట్లు భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో జిల్లా పోలీసు, డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), కేంద్ర భద్రతా బలగాల సంయుక్తంగా సెర్చ్ ఆపేరషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం 7:30 గంటల సమయంలో అప్పటికే మాటువేసి ఉన్న మావోయిస్టులు, బలగాలపై కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో మావోయిస్టు కీలక నేత ఉదమ్ సింగ్ మృతి చెందాడు. ఘటనాస్థలం నుంచి మావోయిస్టు మృతదేహంతో పాటు, ఒక ఏకే47 ఆటోమేటిక్ రైఫిల్ స్వాధీనం చేసుకున్నట్లు బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. అయితే ఆపరేషన్ ముగిసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు. ఇంకా మరికొంత మంది మావోయిస్టులు సమీపంలోనే దాక్కుని ఉండే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.మొత్తం ప్రాంతాన్ని చుట్టుముట్టి సమగ్ర కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. అప్పుడప్పుడు ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయని అన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో భద్రత పెంచారు. గ్రామస్థులు అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని హెచ్చరించారు. పుకార్లు నమ్మవద్దని, భద్రతా బలగాలకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.







తప్పించుకోవడానికి పాక్ కొత్త ప్లాన్

- తిప్పికొట్టేందుకు బీసీసీఐ రెడీ!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ మ్యాచ్ ఆడకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పాకిస్థాన్ క్రికెట్ బోర్డును ఇప్పటికే ఐసీసీ హెచ్చరించింది. భారీ జరిమానాతో పాటు ఆంక్షలు విధిస్తామని పరోక్షంగా మందలించింది. అయితే ఈ ఆంక్షలను తప్పించుకునేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఒక కొత్త చట్టపరమైన ఎత్తుగడకు సిద్ధమైంది. ఫోర్స్ ముజూర్ అనే నిబంధనను ఉపయోగించుకొని ఆంక్షలు తప్పించుకోవాలని పాకిస్థాన్ ప్రణాళికలు రచిస్తోంది. సాధారణంగా ఐసీసీ రూల్స్ ప్రకారం.. ఒక దేశం కావాలని మ్యాచ్ ఆడకపోతే భారీ జరిమానాలు, నిధుల నిలిపివేత వంటి కఠిన చర్యలు ఉంటాయి. అయితే, వీటి నుంచి తప్పించుకోవడానికి పీసీబీ 'ఫోర్స్ మజూర్' అనే నిబంధనను తెరపైకి తెస్తోంది. ఊహించని, తమ నియంత్రణలో లేని అసాధారణ పరిస్థితులు.. ఉదాహరణకు ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ నిషేధాలు ఎదురైనప్పుడు ఫోర్స్ మజూర్ ద్వారా ఒప్పంద బాధ్యతల నుంచి మినహాయింపు కోరవచ్చు. 'మేం ఆడటానికి సిద్ధంగా ఉన్నా.. మా ప్రభుత్వం అనుమతించడం లేదు. ఇది మా చేతుల్లో లేని అంశం.' అని ఐసీసీకి చెప్పడం ద్వారా శిక్షలు, ఆంక్షల నుంచి తప్పించుకోవచ్చని పాక్ భావిస్తోంది. పాకిస్థాన్ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. పాకిస్థాన్ చేస్తున్న ఈ వాదనలో పసలేదని భారత క్రికెట్ బోర్డు గట్టిగా వాదిస్తోంది. ఈ వ్యవహారంపై బీసీసీఐ అధికారి ఒకరు స్పందిస్తూ పాక్ ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపారు. 'టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదని పాక్ ప్రభుత్వం నిర్ణయించిన రోజునే.. పాక్ అండర్ 19 జట్టు భారత్‌తో మ్యాచ్ ఆడింది. ప్రభుత్వానికి నిజంగానే విధానపరమైన అభ్యంతరాలు ఉంటే.. ఆ మ్యాచ్ కూడా ఆడకుండా ఉండాలి కదా? ఒకచోట ఆడి, మరోచోట ఆడననడం కేవలం సాకులు చెప్పడమే.' అని ఓ బీసీసీఐ అధికారి మీడియాతో అన్నాడు.

డబ్ల్యూపీఎల్ విజేత.. ఆర్‌సీబీ

ఫైనల్లో ఢిల్లీపై ఘన విజయం!

వుమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో రెండో టైటిల్ ముద్దాడింది. గురువారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో వడోదర వేదికగా జరిగిన ఫైనల్లో కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వాల్ అసాధారణ ప్రదర్శనతో 6 వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. 204 పరుగుల టార్గెట్‌ను ఛేదించి.. డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్నిఅందుకున్న జట్టుగా ఆర్‌సీబీ సరికొత్త రికార్డ్ సృష్టించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 203 పరుగులు చేసింది. కెప్టెన్ జెమీమా(37 బంతుల్లో 8 ఫోర్లతో 57) హాఫ్ సెంచరీ సాధించగా.. లారా వోల్వర్ట్(25 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 44), చినెల్ హెన్రీ(15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 35 నాటౌట్) దూకుడుగా ఆడారు. ఆర్‌సీబీ బౌలర్లలో సయాలీ సత్ఘరే(1/46), అరుంధతి రెడ్డి(1/40), నదినే డీక్లెర్క్(1/48) తలో వికెట్ తీసారు. అనంతరం ఆర్‌సీబీ 19.4 ఓవర్లలో 4 వికెట్లకు 204 పరుగులు చేసి గెలుపొందింది. జార్జియో వాల్(54 బంతుల్లో 14 ఫోర్లతో 79), స్మృతి మంధాన(41 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సలతో 87) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో చినెల్ హెన్రీ(2/34) రెండు వికెట్లు తీయగా..నందని శర్మ, మిన్ను చెరో వికెట్ పడగొట్టారు. తెలుగు తేజం శ్రీ చరణి(0/46) తీవ్రంగా నిరాశపర్చింది. ఓవరాల్‌గా ఆర్‌సీబీకి ఇది మూడో టైటిల్ కాగా.. వరుసగా రెండో ట్రోఫీ. 204 పరుగుల లక్ష్య ఛేదనలో ఆర్‌సీబీకి ఆశించిన ఆరంభం దక్కలేదు. చినెల్ హెన్రీ వేసిన రెండో ఓవర్‌లోనే ఓపెనర్ గ్రేస్ హ్యారీస్(9) క్లీన్ బౌల్డ్ అయ్యింది. క్రీజులోకి వచ్చిన జార్జియో వాల్.. కెప్టెన్ స్మృతి మంధానతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టింది. మంధాన ఆచితూచి ఆడినా వాల్ తనదైన షాట్లతో చెలరేగింది. దాంతో పవర్ ప్లేలో ఆర్‌సీబీ వికెట్ నష్టానికి 59 పరుగులు చేసింది. పవర్ ప్లే అనంతరం మంధాన కూడా బ్యాట్ ఝులిపించడంతో ఆర్‌సీబీ 10 ఓవర్లలోనే 100 పరుగులు చేసింది. ఈ క్రమంలో జార్జియో వాల్ 37 బంతుల్లో 9 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. ఆ వెంటనే స్మృతి మంధాన 23 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో అర్ధ శతకాన్ని అందుకుంది. క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని విడదీసేందుకు ఢిల్లీ కెప్టెన్ జెమీమా చేసిన ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. బౌలర్లు మార్చినా.. ఫిల్డ్ సెటప్ చేంజ్ చేసినా ఫలితం లేకపోయింది. ప్రతీ ఢిల్లీ బౌలర్‌ను ఈ జోడీ బౌండరీలతో శిక్షించింది. స్మృతి, వాల్ పోటా పడి బౌండరీలు బాదడంతో ఢిల్లీ ఫీల్డర్లు చూస్తూ నిలబడిపోయారు. జార్జియో వాల్‌ను మిన్ను మణి క్యాచ్ ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు నమోదైన 165 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే ఇది అత్యధిక భాగస్వామ్యం. క్రీజులోకి వచ్చిన రిచా ఘోష్ బౌండరీ బాది క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగింది. 19వ ఓవర్ వేసిన చినెల్ హెన్రీ..స్మృతి మంధానను ఔట్ చేసి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. ఆఖరి ఓవర్‌లో ఆర్‌సీబీ విజయానికి 10 పరుగులు అవసరం కాగా.. శ్రీ చరణి బౌలింగ్‌లో తొలి రెండు బంతుల్లో సింగిల్స్ రాగా.. మూడో బంతికి బౌండరీ వచ్చింది. దాంతో చివరి 3 బంతుల్లో 4 పరుగులు అవసరం కాగా.. రాధా యాదవ్ బౌండరీ బాది ఆర్‌సీబీ విజయలాంఛనాన్ని పూర్తి చేసింది.




అనురాగ్ ఠాకూర్‌పై నిషేధం ఎత్తివేసిన సుప్రీంకోర్టు

భారత క్రికెట్ నియంత్రణ మండలి మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ కు బిగ్ రిలీఫ్. నిషేధం కారణంగా దాదాపు పదేళ్లుగా క్రికెట్ వ్యవహారాలకు దూరమైన ఆయనకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న నిషేధాన్ని గురువారం అత్యున్నత న్యాయస్థానం ఎత్తివేసింది. దాంతో, బీసీసీఐ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ఠాకూర్‌కు మార్గం సుగమమైంది. ప్రస్తుతం బీజేపీ ఎంపీ, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. నిషేధం కారణంగా 2017 నుంచి క్రికెట్ వవ్యహారాలకు దూరమైన ఠాకూర్ తనకు ఊరట కల్పించాలని సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. గురువారం ప్రధాన న్యాయమూర్తి ఇందియా సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్య బాగ్జీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఠాకూర్‌పై విధించిన నిషేధం జీవితకాలం కొనసాగదని, ఇప్పటికే ఆయన తొమ్మిదేళ్లు క్రికెట్ కార్యకలాపాలకు దూరమయ్యారని ధర్మాసనం పేర్కొంది. లోధా కమిటీ సిఫార్సులను తిరస్కరించినందుకు అనురాగ్ ఠాకూర్ నిషేధానికి గురయ్యారు. అప్పటి సీజేఐ టీఎస్ ఠాకూర్ ఆయనను బీసీసీఐ అధ్యక్ష స్థానం నుంచి తొలగించారు. బీసీసీఐలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చే ఉద్దేశంతో లోధా కమిటీ సిఫారసులు చేయగా.. ఠాకూర్ మాత్రం అంగీకరించలేదు. బీసీసీఐ ప్రభుత్వ జోక్యంలేదని ఐసీసీకి తప్పులతో కూడిన నివేదిక సమర్పించారు. దాంతో, ధిక్కారం కింద ఆరోపణలు ఎదుర్కొన్న ఠాకూర్ క్షమాపణలు తెలిపారు. కానీ, జూలై నెల నుంచి ఆయనపై ఈరోజు వరకూ నిషేధం కొనసాగింది.



లెనిన్ వాయిదా!?

'అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ రూరల్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లెనిన్' సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో ఈ చిత్రంపై అంచనాలు పెరిగాయి. మొదటగా ఈ సినిమాను మే 1న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో 'లెనిన్' విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్న వార్తలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న అవెయిటెడ్ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ధి' మూవీ రిలీజ్ డేట్ మారడం దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. షూటింగ్ ఆలస్యం, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న విడుదల చేయనున్నట్లు దర్శకుడు బుచ్చిబాబు అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్ నివారించేందుకు 'లెనిన్' చిత్రాన్ని వాయిదా వేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. కొత్త రిలీజ్ డేట్‌పై సోషల్ మీడియాలో ఇప్పటికే చర్చ మొదలైంది. త్వరలోనే చిత్ర నిర్మాణ సంస్థలు అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమయంలో నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా కూడా వాయిదా పడుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. 'లెనిన్' చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేం మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. అఖిల్ సరసన హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. మొదట ఈ ప్రాజెక్ట్ కోసం శ్రీలీలను అనుకున్నప్పటికీ, అనుకోని కారణాలతో ఆమె స్థానంలో భాగ్యశ్రీని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాలో శివాజీ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, రిలీజ్ డేట్‌పై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



హిట్ పెయిర్.. మళ్లీ రిపీట్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం 'AA22xA6' ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భ్‌లతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ - రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ - రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది.

ఫంకీ.. రన్ టైం లాక్



మాస్ కా దాస్ హీరో విశ్వక్ సేన్ లేటెస్ట్ చిత్రం 'ఫంకీ' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీగా ఉంది. ఈ చిత్రాన్ని 'జాతి రత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక ఈ చిత్రాన్ని తమదైన రీతిలో ప్రమోట్ చేస్తూ దూసుకెళ్తున్నారు చిత్ర యూనిట్. ఈ సినిమాను పూర్తి రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దాడు అనుదీప్. ఫిబ్రవరి 13న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయిన ఈ సినిమా రన్‌టైమ్‌ను తాజాగా లాక్ చేశారు. ఈ చిత్రం కేవలం 2 గంటల 8 నిమిషాల నిడివితో చాలా క్రిస్పీగా ఉండబోతోంది. సాధారణంగా కామెడీ సినిమాలకు నిడివి తక్కువగా ఉంటేనే ప్రేక్షకులు బోర్ ఫీల్ అవ్వకుండా ఎంజాయ్ చేయగలరని, అందుకే మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ ఒక విభిన్నమైన పాత్రలో కనిపిస్తుండగా, ఆయన సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అనుదీప్ కేవీ మార్క్ సిల్లీ అండ్ విభిన్నమైన కామెడీ టైమింగ్‌తో ఈ రన్‌టైమ్ మొత్తం నాన్‌స్టాప్ ఎంటర్టైన్మెంట్ అందిస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. కేవలం రెండు గంటల పైచిలుకు సమయం కావడంతో కథనం చాలా వేగంగా సాగే అవకాశం ఉంది. ఇక ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

రాజుగారు.. ఓటీటీలోకి వస్తున్నారు!

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి హీరోగా నటించిన లేటెస్ట్ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు' డిజిటల్ ప్రీమియర్ కోసం సిద్ధమైంది. మారి దర్శకత్వంలో వచ్చిన ఈ రూరల్ డ్రామా థియేటర్లలో ప్రేక్షకులను బాగానే అలరించింది. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించి, తన థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా ముగించుకుంది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026 నుండి ఓటీటీలో స్ట్రీమింగ్ కావడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీనిపై మేకర్స్ లేదా నెట్‌ఫ్లిక్స్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఫిబ్రవరి రెండో వారంలో నవీన్ తన కామెడీ టైమింగ్‌తో ఓటీటీ ఆడియన్స్‌ను పలకరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు. రావు రమేష్, తారక్ పొన్నప్ప, చమ్మక్ చంద్ర, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేసింది.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200